J/NELLORE/003/21-23 R.N.I.No.25359/74 పేజీలు : 12

THE BEST TELUGU WEEKLY OF NELLOREANS

# లాయర్

సంపుటి : 42 సంచిక : 50 19.05.2023, శుక్రవారం వెల : రూ. 5 /- వ్యవస్థాపకులు : తుంగా రాజగోపాలరెడ్డి సంపాదకులు : తుంగా శివప్రభాత్‌రెడ్డి




## జనసేన పొత్తుల పాట

## బీజేపీ - టీడీపీ మౌన బాట



"వైసీపీ వ్యతిరేక ఓటు చీలనీయం"... ఇది జనసేనాని పవన్ ఉచ్చరిస్తున్న మంత్రం. ఎలాగూ తమకు రాష్ట్రమంతా పట్టులేదు కాబట్టి... 30, 40 సీట్లు సాధించి 'కింగ్ మేకర్' కావాలన్నది ఆయన ఉద్దేశం. బహుశా ఆ ఆలోచనతోనే కాబోలు పొత్తుల వైపు మొగ్గుచూపుతున్నానని ఆయనే బహిరంగంగా ప్రకటించేశాడు. జనసేన, టీడీపీ, బీజేపీ కలిసివెళ్తే వైసీపీకి ఓటమి తప్పదని, కలిసే వెళ్తామని కూడా చెప్పేశాడు.

అయితే పొత్తులపై ఏపీ బీజేపీ నేతలు ఒకరిద్దరు తప్పనిసరై మొక్కుబడిగా స్పందించారే తప్ప, టీడీపీ వైపు నుంచి ఎలాంటి అలికిడీ లేదు. తానే కింగ్‌ని కావాలని 2019లో ఒంటరిగా వెళ్లిన పవన్ భంగపడ్డాడు. ఆ ప్రయ త్నంలో టీడీపీని చావుదెబ్బ తీశాడు. తమకున్న బలం సీఎం కావడానికి సరిపోదు కాబట్టి

- పవన్ 'కింగ్ మేకర్' ఆశలు ఫలిస్తాయా?
- కేడర్ లేని పార్టీతో 30, 40 సీట్లు సాధ్యమా?
- టీడీపీ గత విజయాలన్నీ పొత్తులతోనే
- మూడక్షరాల బీజేపీలో మూడు గ్రూపులు
- ప్రాంతీయ పార్టీలకు కమల గండం
- వైసీపీ దోస్తీ నుంచి బీజేపీ బయటపడగలదా?

కర్ణాటకలో కుమారస్వామి తరహాలో 2024లో కనీసం కింగ్ మేకరైనా కావాలంటే పొత్తులతో నడవాలన్న ప్రయత్నాన్ని పవన్ గట్టిగానే చేస్తున్నాడు.

### పవన్ కింగ్ మేకర్ కాగలరా?

జనసేనాని రాజకీయాల్లోకి వచ్చినప్పటి నుంచి గందరగోళానికి తావు లేకుండా ఒక స్పష్టమైన ప్రకటన చేయడం ఇదే మొదటిసారి. 2019 ఎన్నికల ఫలితాల తర్వాత తమ బలంపై ఆయనకి పూర్తి స్పష్టత వచ్చింది. 2019లో 137 స్థానాల్లో పోటీచేసి 5.53శాతం ఓట్లు తెచ్చుకున్నాడు. పార్టీ అధ్యక్షుడిగా తాను రెండు స్థానాల్లో పోటీచేసి పరాజయం పాలయ్యాడు. ఆయన పార్టీ ఒక్క సీటుకే పరిమితం అయ్యింది. పార్టీకి జనంలో బలం లేదని ఆ ఎన్నికలతోనే తేలిపోయింది. 2019లో పార్టీకి బలం, బలగం లేదంటే సరే. 2024కి కూడా పార్టీ పుంజుకోలేకపోతే అది ఎవరి తప్పు ..!?ఎప్పుడో ఒకసారి బహిరంగ సభ పెట్టడం, వచ్చిన అభిమానుల కేకలు, మీడియాలో అటెన్షన్ చూసి మురిసిపోయి మళ్ళీ కొన్నాళ్ల పాటు అజ్ఞాతంలోకి వెళ్లడం తప్పితే , క్షేత్ర స్థాయిలో పార్టీని బలోపేతం చేయడానికి పవన్ చేసిందేమీ లేదు. శ్రీకాకుళం

10లో



# లోకేశ్ పాదయాత్రకు... అపూర్వ ఆదరణ

## టిడిపి పొలిట్‌బ్యూరో సభ్యులు, మాజీమంత్రి సోమిరెడ్డి



టిడిపి యువనేత నారా లోకేశ్ పాదయాత్రకు ప్రజల నుంచి అపూర్వమైన ఆదరణ లభిస్తోందని, వైకాపా ప్రభుత్వం సృష్టిస్తున్న అవాంతరాలన్నిటినీ అధిగమించి లోకేశ్ తన పాదయాత్రను వంద రోజులు పూర్తి చేయడం చరిత్రాత్మకమని, నిజంగా అదొక సాహసయాత్ర అని టిడిపి పొలిట్‌బ్యూరో సభ్యులు, మాజీమంత్రి సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి అన్నారు. లోకేశ్ యువగళం పాదయాత్ర నూరురోజులు పూర్తిచేసుకున్న సందర్భంగా మే15న జిల్లావ్యాప్తంగా టిడిపి నాయకులు, కార్యకర్తలు భారీఎత్తున సంఘీభావ యాత్రలు చేపట్టారు. మండల కేంద్రమైన తోటపల్లిగూడూరులో చేపట్టిన యాత్రలో ఆయన మాట్లాడుతూ, లోకేశ్ పాదయాత్రకు పెద్దఎత్తున ప్రజలు తరలిరావడం చూసి వైకాపా నాయకులు బెంబేలెత్తిపోతున్నారని, రానున్న ఎన్నికల్లో టిడిపి విజయం తథ్యమని, చంద్రబాబునాయుడు మళ్ళీ ముఖ్యమంత్రి కావడం ఖాయమని ధీమా వ్యకం చేశారు. అందుకోసం నాయకులు, కార్యకర్తలు నిరంతరం కృషిచేయాలని, పార్టీని మరింతగా బలోపేతం చేయాలని సూచించారు. రాష్ట్రంలో వైకాపా అరాచకాలు, అవినీతి పెచ్చుమీరిపోయాయన్నారు. వైకాపాను ఇంటికి సాగనంపే రోజులు దగ్గరపడ్డాయన్నారు. ప్రజలు చంద్రబాబునాయుడును ముఖ్యమంత్రిగా చేసేందుకు సిద్ధంగా ఉన్నారని ధీమా వ్యక్తం చేశారు. తోటపల్లిగూడూరు మండల టిడిపి నాయకుడు సురేష్‌రెడ్డి ఆధ్వర్యంలో చేపట్టిన ఈ సంఘీభావ యాత్రలో పెద్దసంఖ్యలో స్థానిక నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# మహిళల అభ్యున్నతికి ప్రణాళికలు చేపట్టండి

## - అధికారులకు జిల్లా కలెక్టర్ ఆదేశం



రాష్ట్రవ్యాప్తంగా మహిళల ఆర్థిక స్వావలంబనకు రాష్ట్ర ప్రభుత్వం అవసరమైన చర్యలు చేపడుతున్నదని, అందుకనుగుణంగా జిల్లాలో అర్హత ఉన్న ప్రతి మహిళను స్వయం సహాయక సంఘాల్లో సభ్యులు చేర్పించి వారికి ఆర్థిక తోడ్పాటు అందించడంతో పాటు మహిళల అభ్యున్నతికి ప్రతిఒక్కరూ కృషిచేయాలని జిల్లా కలెక్టర్ ఎం.హరినారాయణన్ జిల్లా గ్రామీణాభివృద్ధి సంస్థ అధికారులను ఆదేశించారు. ఈనెల 16న ఆయన నెల్లూరులోని డిఆర్‌డిఏ సమావేశ మందిరంలో డిఆర్‌డిఏ పీడీ సాంబశివారెడ్డితో కలసి జిల్లా గ్రామీణాభివృద్ధి సంస్థ ద్వారా చేపడుతున్న పలు అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాల అమలుతీరుపై మండలాల వారీగా సమీక్షించారు. ముఖ్యంగా ఎస్‌సి, ఎస్‌టి స్వయం సహాయక సంఘాలపై ప్రత్యేక దృష్టి సారించి సమాజంలో ఆ వర్గాల వారు ఆర్థికంగా అభివృద్ధి చెందేలా పనిచేయాల్సిన అవసరం ఉందన్నారు. నిర్దేశించిన లక్ష్యం మేరకు అర్హత ఉన్న ప్రతి ఒక్కరిని వైఎస్సార్ బీమా పథకంలో చేర్పించాలన్నారు. ప్రధానమంత్రి జీవన జ్యోతి యోజన, ప్రధాన మంత్రి సురక్షా బీమా యోజన పథకాలకు సంబంధించి అర్హత ఉన్న ధరఖాస్తులన్నీ సంబంధిత బ్యాంకుల్లో నమోదు చేయాలని, విధుల పట్ల అలసత్వం ప్రదర్శించిన వారిపై చర్యలు తీసుకోవడం జరుగుతుందని కలెక్టర్ స్పష్టం చేశారు.

# రాష్ట్రంలో అరాచక పాలన

## - దుయ్యబట్టిన బిజెపి నాయకులు



రాష్ట్రంలో ఎప్పుడూ లేనివిధంగా ఇప్పుడు అరాచకపాలన, రాక్షసపాలన కొనసాగుతోందని, వైకాపా ప్రభుత్వంలో దుర్మార్గాలు పెరిగిపోయాయని బిజెపి జాతీయ కిసాన్‌మోర్చా అధ్యక్షుడు సన్నపురెడ్డి సురేష్‌రెడ్డి, నాయకులు వాకాటి నారాయణరెడ్డి, భరత్‌కుమార్‌యాదవ్, కర్నాటి ఆంజనేయరెడ్డి, మిడతల రమేష్ తదితరులు ధ్వజమెత్తారు. ఈనెల 13న నెల్లూరులోని బిజెపి కార్యాలయంలో ఏర్పాటుచేసిన విలేకర్ల సమావేశంలో వారు మాట్లాడుతూ, వైకాపా పాలన తీరును దుయ్యబట్టారు. ముఖ్యమంత్రి పర్యటన సందర్భంగా ప్రతిపక్షాల నాయకుల్ని ముందుగానే అరెస్ట్ చేయడంతో పాటు, ముఖ్యమంత్రికి సమస్యలు తెలియజేసుకుందామని వచ్చినవారిని కొట్టి కేసులు పెట్టే ఈ ప్రభుత్వం ప్రజాస్వామ్య ప్రభుత్వమేనా?..అని వారు ప్రశ్నించారు. కావలి బిజెపి నాయకుడు మొగరాల సురేష్ పట్ల కావలి డిఎస్పీ కర్కశంగా వ్యవహరించడం దారుణమని, ఇంతటి ఘోరాలు ఎప్పుడూ చూడలేదని పేర్కొన్నారు. అరాచకాల వైకాపాకు ప్రజలే గుణపాఠం చెప్పాలన్నారు. బిజెపి నాయకులు బి.శ్రీనివాసులు, కాకు విజయలక్ష్మి, గిరికుమార్‌గౌడ్, కాయల మధు పాల్గొన్నారు.

## బుచ్చి కోదండరామునికి..

# వెండివస్తువుల బహుకరణ

బుచ్చిరెడ్డిపాళెం పెద్దూరులో ఉన్న శ్రీ కోదండరామస్వామి వారికి కాంచీపురానికి చెందిన టి.పద్మావతి అనే భక్తురాలు ఈనెల 13న 3.5 కేజీల బరువున్న వెండి వస్తువులను బహుకరించినట్లు ఆలయ వ్యవస్థాపక ధర్మకర్త దొడ్ల మురళీకృష్ణారెడ్డి తెలియజేశారు.

# కావలిలో దొంగల హల్‌చల్

## ఒకేరాత్రి ఆరు ఇళ్లల్లో చోరీ

కావలి పట్టణం దొంగలకి అడ్డాగా మారిపోయింది. ఒకే రాత్రి ఏకంగా ఆరిళ్లల్లో చోరీలకు పాల్పడి దొరికిన సొత్తునంతా మూటగట్టుకుపోయారు. కావలి వెంగళరావునగర్‌లోని 'ఆరోగ్యమిత్ర' తిరుపతయ్య ఇంట్లో సోమవారం రాత్రి (మే15) దొంగలుపడి ఇంట్లో ఉన్న 3 వేలరూపాయలతో పాటు సెల్‌ఫోన్‌ను కూడా ఎత్తుకుపోయారు. ఆ పక్కనే ఉన్న బాబు-షకీల దంపతుల ఇంట్లో ఫోన్‌తో పాటు 2 వేలు, ఆ తర్వాత సరస్వతి ఇంట్లో 1500 రూపాయలు, అలా ఆ ప్రాంతంలో మొత్తం ఆరుగురి ఇళ్లల్లో చొరబడి దొరికన డబ్బు, సెల్‌ఫోన్‌లు దొంగిలించుకుపోయారు. బాధితుల ఫిర్యాదుతో కావలి టూటౌన్ పోలీసులు కేసు నమోదుచేసుకుని దొంగల కోసం గాలిస్తున్నారు.

# హైవేపై దుండగుల వీరంగం

## డ్రైవర్‌ను కొట్టి కంటైనర్‌తో పరార్

హైవే (జాతీయరహదారి)పై దుండగులు వీరంగం చేస్తున్నారు. తమిళనాడు నుంచి హైవేపై వస్తున్న ఓ కంటైనర్ వాహానాన్ని వెంకటాచలం వద్దనున్న కాకుటూరు సమీపంలో దుండగులు అటకాయించి డ్రైవర్‌ను చితకబాది, కంటైనర్‌తో సహా పరారైపోయారు. ఈనెల 14వ తేది రాత్రి ఈ సంఘటన జరిగింది. పోలీసుల కథనం మేరకు, కోయంబత్తూరుకు చెందిన ఓ మసాలా దినుసుల లోడుతో గౌహతికి వెళ్తున్న కంటైనర్‌కు, దుండగులు మార్గ మధ్యంలో కాకుటూరు వద్ద మరో కంటైనర్‌ను అడ్డం పెట్టారు. డ్రైవర్ అదేమని అడిగేలోగా, ఆ కంటైనర్‌లో ఉన్న ముగ్గురు దుండగులు ఒక్కసారిగా ఆ డ్రైవర్‌ను రాడ్లు, కర్రలతో దాడిచేసి తీవ్రంగా కొట్టి రోడ్డుపక్కన పడేశారు. తమ కంటైనర్‌తో పాటు, మసాలా దినుసుల కంటైనర్‌తో సహా పారిపోయారు. కంటైనర్ ఖరీదు దాదాపు 20 లక్షల దాకా ఉంటుందని, దానిలో ఉన్న దినుసుల విలువ మరో 7.20 లక్షల దాకా ఉంటుందని బాధితుడైన డ్రైవర్ వెంకటాచలం పోలీసులకు ఫిర్యాదు చేశాడు.

# ఇకెవైసి చేయించుకోవాలి

రాష్ట్ర ప్రభుత్వ పెన్షనర్లు ఈనెల 20వ తేదీలోగా ఇకెవైసి చేయించుకోవాలని రాష్ట్ర ప్రభుత్వ పెన్షనర్ల సంఘం జిల్లా అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు గౌస్, మూర్తి ఒక ప్రకటనలో తెలిపారు. జిల్లాలో పెన్షనర్లు 21700 మంది ఉన్నారని, వారిలో 12,600 మందే ఇకెవైసి చేయించుకున్నారని, మిగిలిన వారు కూడా త్వరితగతిన ఇకెవైసి చేయించుకోవాలని వారు కోరారు.

# బండలు పగిలే.. ఎండలు!

- 46 డిగ్రీలు దాటేసిన ఉష్ణోగ్రత
- అల్లాడిపోతున్న ప్రజలు



ఈ వారం ఎండలు అదిరిపోయాయి. "రోహిణికార్తెలో రోళ్ళు పగిలే ఎండలు" కాస్తాయి అని నానుడి. అయితే ఇప్పుడు రోళ్ళే కాదు.. బండలు, కొండలు కూడా పగిలిపోయే ఎండలు బెంబేలెత్తిస్తున్నాయి. సాధారణంగా 30 నుంచి 35 డిగ్రీల ఎండలనే భరించలేని జిల్లా ప్రజలు ఇప్పుడు ఏకంగా 46 డిగ్రీల ఎండల్ని భరించాల్సి వచ్చింది. ఈ ఎండల దెబ్బకు జనం అల్లాడిపోతున్నారు. ఉదయం 7 గంటల నుంచే ఎండలు చుర్రుమంటూ మొదలై, మధ్యాహ్నానికి చండప్రచండంగా తయారై జనాన్ని వేపుకు తింటున్నాయి. జిల్లాలోనే కాదు, రాష్ట్రవ్యాప్తంగా ఎండలు భగ్గుమంటున్నాయి. అయితే, సముద్ర తీర ప్రాంతం, అందులోనూ జిల్లాలో అడవులు విస్తారంగానే ఉన్నా ఎండలు ఇంతగా మండిపోతుండడం గమనార్హం. జిల్లాలో ఏడాదికేడాది ఎండలు పెరుగుతున్నాయే తప్ప తగ్గుముఖం పట్టడం లేదు. నగరంతో పాటు, పట్టణ ప్రాంతాల్లో కూడా పెద్దపెద్ద చెట్లను నరికిపారేయడంతో జనానికి ఈ ఎండల్లో నిలువ నీడ లేకుండా పోయింది. రోడ్ల విస్తరణ పేరుతో ఎవరిష్టం వచ్చినట్లు వాళ్ళు చెట్లని కొట్టేయడం, చివరికి సముద్రతీర ప్రాంతాల్లో ఉన్న చెట్లని కూడా ఎవరికి తోచినట్లు వారు కొట్టేసుకుని, అమ్మేసుకుంటుండడం, ప్రకృతి వనరుల్ని దోచుకుంటూ, పర్యావరణం పట్ల పచ్చదనం పట్ల ఏమాత్రం శ్రద్ధ చూపకపోవడం, దీంతోపాటు భారీస్థాయిలో కాలుష్యవాతావరణ పెరిగిపోవడం తదితర కారణాలతో జిల్లా నిప్పులకొలిమిగా మారిపోయింది. ఎండాకాలం వస్తే చాలు.. బయట కాలుపెట్టడానికి కూడా జనం భయపడే దుస్థితి వచ్చేసింది. ఒకప్పుడు పచ్చని చెట్లతో అలరారుతూ ఎండలెంతున్నా ఇంతగా కాలిపోకుండా, చల్లగా ఉండే జిల్లా కూడా..ఇప్పుడు నిప్పులగుండంగా మారిపోయింది. గత ఏప్రిల్ నెలలోనే ఎండలు మండిపోయి జనానికి చుక్కలు చూపించాయి. ఇప్పుడు మే నెలలో గతంలో ఎన్నడూ లేనంతంగా ఎండలు మిడిమేళంగా ఉన్నాయి. 35 డిగ్రీలకే 'అమ్మో ఇవేం ఎండలు బాబోయ్' అని ఒకప్పుడు బెంబేలెత్తిపోయిన జనం..ఈనెల 15వ తేదీన 46 డిగ్రీల ఎండవేడిమికి ఉక్కిరిబిక్కిరైపోయారు. ఎండ సెగకి తోటకూరకాడల్లా వాడిపోయారు. మెట్ట ప్రాంతమైన కొండాపురంలో అత్యధికంగా 46.4 డిగ్రీల ఉష్ణోగ్రత నమోదైందంటే జిల్లాలో ఎండలు ఎంత మండిపోతున్నాయో అర్థం చేసుకోవచ్చు. వేడిగాలులతో జిల్లా పెనంమీద మాడిపోయిన దోసెలా మలమలమాడిపోయింది. రోడ్లన్నీ నిర్మానుష్యంగా మారాయి. ఈ ఎండలకు తట్టుకోలేక ముసలీముతకాతో పాటు, పిల్లల పడుతున్న అవస్తలు వర్ణనాతీతం. పగలంతా ఎండలు, రాత్రయితే ఉక్కపోత.. మధ్యలో మన కర్మకాలి కరెంటు పోయిందా.. ఇక అంతేసంగతులు. అయినా, జనం గోడు ఎవరు పట్టించుకుంటారు?...

# ఉద్యోగాల పేరుతో బురిడీ కొట్టించారు

ఇందుకూరుపేటకు చెందిన ఓ దంపతుల మాయమాటలకు మోసపోయి దాదాపు 8 లక్షల రూపాయలను వారిచేతికిచ్చి మోసపోయామని, తమను ఆదుకోవాలంటూ కొందరు బాధితులు ఈనెల 15న 'స్పందన' కార్యక్రమంలో జిల్లా ఎస్పీ కె.తిరుమలేశ్వర రెడ్డికి మొరపెట్టుకున్నారు. ఆప్కోస్‌లో ఉద్యోగాలిప్పిస్తామని, అక్కడి అధికారులు తమకు తెలుసని, ఇప్పటికే ఎంతోమందికి ఉద్యోగాలిప్పించామని చెప్పడంతో, వారిని నమ్మి డబ్బులిచ్చామని, పిహెచ్‌సిలు-ప్రభుత్వ వైద్యశాలల్లో డేటా ఎంట్రీ ఆపరేటర్ల పోస్టులిప్పిస్తామని నమ్మబలికారని, అయితే నెలలు గడుస్తున్నా ఉద్యోగాలు మాత్రం రాలేదని వారు వాపోయారు. అదేమని అడిగితే మీకు దిక్కున్నచోట చెప్పుకోమని అంటున్నారని బాధితులు ఆవేదన వ్యక్తం చేశారు. ఈ విషయమై తగు చర్యలు తీసుకుంటామని ఎస్పీ వారికి చెప్పారు. జిల్లాలో ఉద్యోగాల పేరుతో మోసాలు బాగా జరుగుతున్నాయని, ఉద్యోగాలిప్పిస్తామని డబ్బులు గుంజేవారిని ఎవరూ నమ్మవద్దని, ప్రజలు అప్రమత్తంగా ఉండాలని ఎస్పీ ఈ సందర్భంగా ప్రజలకు విజ్ఞప్తి చేశారు.

# వేడుకగా 'మాతృదినోత్సవం'



అంతర్జాతీయ మాతృదినోత్సవం సందర్భంగా ఇటీవల నవ్యాంధ్ర రచయిత్రుల సంఘం-నెల్లూరుశాఖ ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో ప్రముఖ నవలా రచయిత్రి డాక్టర్ పెళ్ళకూరు జయప్రదను, ప్రముఖ ఉపాధ్యాయిని, ఉత్తమ గృహిణిగా ఎన్నో అవార్డులు పొందిన గుడిపాటి విజితను దుశ్శాలువలతో ఘనంగా సన్మానించారు. స్థానిక జడ్పీ కాలనీలో ఉన్న సూర్య స్కూల్‌లో జరిగిన ఈ కార్యక్రమంలో ప్రముఖ కవయిత్రులు పాతూరు అన్నపూర్ణ, తోట సులోచన, శేషమ్మ, నీలం స్వాతి తదితరులతో పాటు పద్యకళా పరిషత్ అధ్యక్షులు మెట్టు రామచంద్రప్రసాద్, ప్రముఖ కవులు డా.చీమకుర్తి వెంకటేశ్వర్లు, పద్య సారస్వత పరిషత్ అధ్యక్షులు పోలవరపు లక్ష్మీనరసింహారావు, పెరసం అధ్యక్షులు అవ్వారు శ్రీధర్‌బాబు, ఈతకోట సుబ్బారావు, మద్దూరు శ్రీనివాసులు, శ్రీమన్నారాయణ, అంకబాబు తదితరులు పాల్గొన్నారు.

## రహదారి భద్రత కోసం..

# చందర్ ఆధ్వర్యంలో కొత్త విధానం

రహదారి భద్రత కోసం, ప్రత్యేకించి విద్యాసంస్థల వాహనాలు ఎలాంటి ప్రమాదాలకు గురికాకుండా తగు జాగ్రత్తలు తీసుకోవడం కోసం నెల్లూరు ఉప రవాణా కమిషనర్ బి.చందర్ ఒక ప్రత్యేక విధానాన్ని రూపొందించారు. ప్రమాదాల సమయాల్లో డ్రైవర్లు ఎలాంటి జాగ్రత్తలు తీసుకోవాలి?..అత్యవసర సందర్భాల్లో ఎలా వ్యవహరించాలి వంటి ముఖ్యమైన అంశాలతో రవాణా సిబ్బంది సహకారంతో రూపొందించిన ఈ విధానం ఎంతో ప్రయోజన కరంగా ఉంటోంది కూడా.

సాధారణంగా ప్రతి సంవత్సరం విద్యాసంస్థల వాహనాలు ఫిట్‌నెస్ కాలపరిమితి మే నెల 15వ తారీఖున ముగుస్తుంది కనుక, విద్యాసంస్థల బస్సుల సామర్థ్య ధ్రువీకరణ పత్రం కోసం వాహనాల వారు నెల్లూరులోని రవాణా కార్యాలయానికి వస్తుంటారు. ఆ సమయంలో వాహనాల ఫిట్‌నెస్ ధ్రువీకరణ పత్రానికి వాహనాన్ని తీసుకొచ్చే విద్యాసంస్థల డ్రైవర్లకు ఉపరవాణ కమిషనర్ వారి కార్యాలయంలో ప్రతిరోజు రహదారి భద్రతపై ప్రత్యేక అవగాహన కల్పించడం ద్వారా ప్రమాదాలను నివారించవచ్చని భావించిన చందర్, ఈ కొత్త విధానాన్ని పవర్‌పాయింట్ ప్రజెంటేషన్‌తో దృశ్యవాణి ద్వారా వారికి అవగాహన కల్పించేందుకు కృషి చేస్తున్నారు. ఈ సందర్భంగా ఉపరవాణ కమిషనర్ చందర్ మాట్లాడుతూ, నేటి విద్యార్థులే రేపటి పౌరులని, వారి రక్షణ కోసం అనేక జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. బాలల రక్షణ విషయంలో విద్యాసంస్థల యజమానులకు మరింత బాధ్యత ఉందన్నారు. ఈ పవర్‌పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా అత్యవసర సమయంలో వాహన డ్రైవర్ స్పందించాల్సిన తీరును సవివరంగా వివరించడం, ఆ సమయంలో పిల్లలను ఏ విధంగా క్రిందికి దింపాలి, ఎమర్జెన్సీ డోర్ ఆవశ్యకత, అగ్నిమాపక పరికరాన్ని ఎలా వాడాలి.. అనే విషయాలపై ఏడు నిమిషాల నిడివి గల వీడియోని ప్రదర్శించామని, రహదారి ప్రమాదాలు జరగకుండా మరియు విద్యార్థులు బస్సు ఎక్కేటప్పుడు, దిగేటప్పుడు వాహన డ్రైవర్లు జాగ్రత్త వహించాలని ఆయన తెలియజేశారు. ప్రాంతీయ రవాణా శాఖాధికారి కొర్రపాటి మురళీమోహన్, మోటారు వాహనాల తనిఖీ అధికారులు బాలమురళీకృష్ణ, కార్తీక్ పవన్, ఎస్‌కె.బాబు, పరిపాలన అధికారి బి.కిషోర్, సహాయ మోటార్ వాహన తనిఖీ అధికారులు పూర్ణ చంద్రరావు, స్వప్నిల్‌రెడ్డి, రఘువర్ధన్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు

### విద్యాసంస్థల వాహనాల డ్రైవర్ల కోసం ప్రత్యేక అవగాహన






నెల్లూరుజిల్లా స్థానిక సంస్థల ఎమ్మెల్సీగా ఇటీవల అమరావతి సచివాలయ ప్రాంగణంలో ప్రమాణస్వీకారం చేస్తున్న మేరిగ మురళీధర్

## నంది వాహనంపై కామాక్షితాయి అమ్మవారు



జిల్లాలోని ప్రసిద్ధ పుణ్యక్షేత్రమైన జొన్నవాడలోని శ్రీ మల్లికార్జున సమేత కామాక్షితాయి అమ్మవారి సన్నిధిలో జరుగుతున్న బ్రహ్మోత్సవాల్లో భాగంగా ఈనెల 17న నంది వాహనోత్సవం వేడుకగా జరిగింది. అమ్మవారిని, స్వామివారిని వాహనంపై కొలువుదీర్చి, ప్రత్యేకపూజలు చేసిన అనంతరం వాహనోత్సవాన్ని నిర్వహించారు. తొలుత, ఆలయంలో గణపతి పూజ, పుణ్యాహవచనం, కలశారాధన పూజలు, స్వామివారికి మహన్యాసపూర్వక రుద్రాభిషేకాలు నేత్రపర్వంగా జరిగాయి. యాగశాలలో దీక్షాహోమం చేపట్టారు. ఆ తర్వాత, భాజాభజంత్రీలతో గిన్నెభిక్ష ఉత్సవాన్ని నిర్వహించారు. వాహనోత్సవాల సందర్భంగా జొన్నవాడ వీధులు రంగురంగుల విద్యుద్దీపాలంకరణలతో కళకళలాడాయి. వేలసంఖ్యలో భక్తులు తరలివస్తుండడం విశేషం.




లాయర్
మే 19, 2023

# ఈ మండే ఎండలు..మనకేం చెప్తున్నాయి?

చిన్నప్పుడు చదువుకున్న ఏడుచేపల కథ అందరికీ గుర్తుండే ఉంటుంది. అందులో ఒక చేప ఎండకపోవడం, గడ్డిమోపు అడ్డం రావడం, చివరికి చీమకుట్టడం, చీమా చీమా ఎందుకు కుట్టావంటే..నా బంగారుపుట్టలో వేలుపెడితే కుట్టనా?.. అనడం ఈ కథ అందరికీ తెలిసిందే. ఇప్పుడు మండేఎండల్ని చూస్తుంటే.. ఆ కథ గుర్తుకొస్తూ ఉంది. 'ఎండలూ..ఎండలూ మీరెందుకింత మండిపోతున్నారూ అంటే..చివరికి అవన్నీ 'ఎల్నినో' దాకా వేలు చూపిస్తాయి. 'ఎల్నినో' అంటే ఏమిటా అని మనం అప్పుడు ఆలోచిస్తాం. ఎల్నినో అనేది వాతావరణానికి సంబంధించి జరిగే క్రియల్లో ఒక మార్పు. వాతావరణస్థితికి భిన్నంగా, ఇండోనేషియా-ఆస్ట్రేలియా దేశాల దగ్గర పసిఫిక్ సముద్రపు ఉపరితల ఉష్ణోగ్రతలు చల్లగాను, దక్షిణ అమెరికా-ఉత్తర అమెరికా దేశాల దగ్గర సముద్రపు ఉపరితల ఉష్ణోగ్రత్తలు వేడిగాను మార్పు చెందుతాయి. ఈ ప్రత్యేక వాతావరణ పరిస్థితినే నిపుణులు 'ఎల్నినో స్థితి'గా భావిస్తుంటారు. దీని ప్రభావం ఎలా ఉంటుందంటే, శీతాకాలాలు కూడా వేడిగా ఉంటాయి. వేసవి మరింత వేడిగా..మండిపోతుంది. రుతుపవనాలు బలహీనంగా ఉంటాయి. ఈ ఎల్నినో ప్రభావం వల్లనే ఇప్పటి వేడిగాలులు, మిడిమేళపు ఎండలని నిపుణులు చెప్తున్నారు. పసిఫిక్ మహాసముద్రపు జలాలు వేడెక్కడం వల్ల వాతావరణంలో మార్పులు జరిగి ఎండలు మండుతున్నాయని అంటున్నారు. జూన్ 19వ తేది నాటికి ఎండలు మరింతగా మండిపోతాయని కూడా చెప్తున్నారు. ఇప్పుడు మనం ఎదుర్కొంటున్న పరిస్థితి ఇదే. భూ తాపం పెరిగిపోతుండడం, వాతావరణంలోకి కర్బన ఉద్గారాల శాతం భయంకరంగా పెరిగిపోతుండడం వల్ల జరిగే అనర్థాలివి. ప్రకృతిని, పర్యావరణాన్ని పట్టించుకోకుండా మానవుడు చేసుకుంటున్న స్వయంకృతాపరాధాలే ఇవి. ముఖ్యంగా మన ఆంధ్రప్రదేశ్‌లోని 170 మండలాల్లోనూ, తెలంగాణలోని 280 మండలాల్లోనూ ఈ ఎండలు మరింత తీవ్రంగా ఉండడం, ప్రజలు ఈ ఎండలకు తాళలేక విలవిలలాడుతుండడం కళ్లారా చూస్తున్నాం. తూర్పుగోదావరి జిల్లా ధవళేశ్వరంలో కనీవినీ ఎరుగని విధంగా మే 16న 46.8 డిగ్రీల ఉష్ణోగ్రత నమోదైంది. అదేవిధంగా ప్రకాశం జిల్లాలో 46.7, శ్రీకాకుళంలో 46.5, కోనసీమలో 46.3, కాకినాడలో 45.2, నెల్లూరులో 45.9, తిరుపతిలో 45.4 డిగ్రీల ఉష్ణోగ్రత నమోదైంది. అనేక మండలాల్లో వడగాడ్పులతో ప్రజలు అల్లాడిపోయారు. ఈ ఎల్నినో ప్రభావంతోనే రానున్న రోజుల్లో ఢిల్లీ, ఉత్తరప్రదేశ్, చత్తీస్‌గడ్ వంటి ఉత్తరాది రాష్ట్రాల్లో పరిస్థితులు మరింత సంక్లిష్టంగా మారనున్నాయని కూడా నిపుణులు హెచ్చరిస్తున్నారు. అంతేకాదు, రానున్న రుతుపవనాల మీద కూడా ఎల్నినో ప్రభావం ఎంతగానో ఉంటుందని, నైరుతి రుతుపవనాలు ఈసారి మరో మూడు రోజులు ఆలస్యంగా వస్తాయని వాతావరణశాఖ చెప్తోంది. జూన్ 1న రావాల్సిన రుతుపవనాలు జూన్ 4న కేరళను తాకవచ్చని అంచనా.

ప్రపంచవ్యాప్తంగా వాతావరణంలో జరుగుతున్న ఈ మార్పులను ఎవరూ మార్చలేరు కనుక, వాటి ద్వారా వచ్చే కష్టనష్టాలను ఎదుర్కొనేందుకు ముందుగా ఎవరికి వారు ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేసుకోవడం ఒక్కటే మార్గం. ఎల్నినో వల్ల వర్షాకాలం దెబ్బతినే అవకాశం ఉంది కనుక, ఉన్న జలవనరులను పరిరక్షించుకోవడం ఉత్తమం. కాలుష్య వాతావరణం లేకుండా చూడడం అత్యవసరం. ఎల్నినో వస్తే కరువు పరిస్థితులు వచ్చినట్లే కనుక, దానిని అధిగమించేందుకు ప్రభుత్వాలు ఇప్పటినుంచే యుద్ధ ప్రాతిపదికపై ప్రణాళికలు రూపొందించి అమలుచేయాలి. ప్రజలు ఎండల తీవ్రతను తట్టుకునేందుకు ఎక్కడికక్కడ చలువపందిళ్ళు వేసుకోవడం, చెట్లను పరిరక్షించుకోవడం, ఎండ తగలకుండా ఇళ్ళకు తగ్గ ఏర్పాట్లు చేసుకోవడం, ఎండకు తిరగకుండా చల్లని నీడలో ఉండడం, ముఖ్యంగా మట్టి కుండల్లో నీరు తాగడం వగైరాలపై మునుపటికన్నా ఎక్కువ శ్రద్ధ తీసుకోవాలి. లేకుంటే జరిగే కష్టనష్టాలకు ఎవరూ చేసేదేమీ ఉండదు. ఎల్నినో ప్రభావాన్ని తక్కువగా చూడవద్దని, గత 140 ఏళ్ళలో మనదేశంలో వచ్చిన కరువు కాటకాల్లో అనేకం ఎల్నినో వల్లే వచ్చినవేనని, దీనివల్ల దోమల సంబంధిత వ్యాధులైన మలేరియా, డెంగ్యూ వంటివి కూడా బాగా ప్రబలిపోయే అవకాశం ఉంటుందని కూడా నిపుణులు హెచ్చరిస్తున్నారు. కనుక, ఈ మండే ఎండల్లో మలమల మాడిపోకుండా, ప్రజలు ఎవరికి వారు ముందుజాగ్రత్తల్లో ఉండడం అవసరం. అదే అన్నివిధాలా శ్రేయస్కరం!..

# అవును... అక్షరానికి ఆపదే...!

ఈ-మెయిల్
ప్రజావాణి
lawyerpatrika@gmail.com
+91 98663 14741

గతవారం మన 'లాయర్'లో పతాక శీర్షికలో రాసిన వ్యాసం వాస్తవికతకు అద్దం పట్టినట్లుగా ఉంది. సమాజంలో జరుగుతున్న సంఘటనలను, జర్నలిజం పట్ల రాజకీయ నాయకులు ప్రవర్తిస్తున్న తీరును కళ్ళకు కట్టినట్లుగా ప్రస్తావించారు. ఆర్థిక నేరగాళ్లకి, వీధి రౌడీలకి, గుండాలకి, నిరక్షరాస్యులకి రాజకీయ రంగం వేదికగా మారడంతో, ఇలాంటి దౌర్భాగ్యపు పరిస్థితులు ఏర్పడ్డాయి. దేశవ్యాప్తంగా ఎక్కడో ఒకచోట తరచూ మీడియాపై దాడులు జరుగుతూనే ఉన్నాయి. ప్రభుత్వాలు సైతం అక్రమకేసులతో మీడియాచేతులకి సంకెళ్లువేసి, వాటి గొంతు నొక్కి, నోళ్లు మూయించాలని చూస్తున్నాయి. మీరు ప్రస్తావించినట్లుగా సమాజాన్ని నడిపించే నాలుగు కీలక వ్యస్థలలో ఒకటిగా మీడియాని కూడా పిలుస్తారు. ఫోర్త్ఎస్టేట్‌గా ఈ రంగానికే అత్యున్నత స్థాయి గుర్తింపు ఉంది. అలాంటి మీడియా ఇప్పుడు బెదిరింపులకు దౌర్జన్యాలకు గురికావడం శోచనీయం.

జర్నలిజంలో కూడా మార్పులు రావాలి. చాలాచోట్ల జర్నలిస్టులు ఎర్నలిస్టులుగా మారారు. కొంతమంది బ్లాక్ మెయిలింగ్‌కి కూడా పాల్పడుతున్నారు. కొన్ని మీడియా సంస్థలు తమ వ్యాపార వ్యవహారాల కోసం, స్వార్థ ప్రయోజనాల కోసం తమ పత్రికలని, ఛానెళ్లని ఊతంగా వాడుకుంటున్నారు. అలాంటివాళ్ళ వల్లనే నిబద్ధతతో పనిచేసే పాత్రికేయులకు, సంస్థలకు కూడా మచ్చ ఏర్పడుతోంది. గుర్రాన్ని, గాడిదను ఒకే గాటికి కట్టేసి రాజకీయ పార్టీలు, నేతలు ఫుట్‌బాల్ ఆడుకుంటున్నారు. ఇలాంటి పరిస్థితులకు చరమగీతం పాడకుంటే రాబోయేకాలంలో మీడియా మనుగడ ప్రశ్నార్థకమే. నీతి నిజాయితీలతో పనిచేసే సంస్థలు కొనసాగడం కష్టమే...!

క్రిష్టపాటి పార్థసారథిరెడ్డి, బెంగళూరు.

# మంచినీళ్ల కటకటలు తీర్చండి

ఈ మండువేసవిలో జిల్లాలోని అనేక ప్రాంతాల్లో తాగునీటి కష్టాలు ప్రారంభమయ్యాయి. జిల్లాలో నీటి వనరులు పుష్కలంగా ఉన్నా, అనేక మారుమూల గ్రామాల్లోను, పట్టణాల్లో శివారు ప్రాంతాల్లోనూ నివసిస్తున్న ప్రజలకు అవసరమైన తాగునీరు మాత్రం సమయానికి లభ్యం కావడం లేదు. నిద్రమంచం లేచిందగ్గర నుంచి నీళ్ల కోసం ప్రజలు, ముఖ్యంగా మహిళలు ఇబ్బందులు పడాల్సి వస్తోంది.

కొన్ని గ్రామ పంచాయతీల్లో తాగునీటి సరఫరా జరుగుతున్నా, పర్యవేక్షణ సక్రమంగా లేకపోవడంతో అస్తవ్యస్తంగా ఉంది. కొన్ని గ్రామాల్లో కుళాయిలున్నా వాటిలో నీళ్లు రావడం లేదు. వేసవి ముందుగానే కుళాయిలను, తాగునీటి రక్షిత పథకాలను పరిశీలించి అవసరమైన మరమ్మతులు చేయకపోవడంతో, కొన్నిచోట్ల తాగునీళ్లు కలుషితమవుతున్నాయి. అధికారులు జిల్లావ్యాప్తంగా కుళాయిల పరిస్థితిని, రక్షిత మంచినీటి పథకాల స్థితిగతులను ఒకసారి పరిశీలించి లోటుపాట్లను సరిదిద్దితే బావుంటుంది.

జి.దశరథరామయ్య, కోట.

# చిన్న 'దోమ'తోనే.. పెద్ద ప్రమాదం



దోమల కారణంగా వచ్చే డెంగ్యూ వంటి ప్రాణాంతక వ్యాధుల పట్ల కూడా అధికారులు, ప్రజలు చాలా నిర్లక్ష్యంగా ఉంటున్నారు. తీరా ఆ వ్యాధి వచ్చాక ప్రాణభయంతో ఆసుపత్రులకు పరుగెడుతున్నారు. నిజంగానే డెంగ్యూ వ్యాధి ప్రమాదకరమైనది. ప్రాణాంతకమైనది కూడా. అందులో ఎలాంటి సందేహం అక్కర్లేదు. ఈ వ్యాధి వల్ల గతంలో జిల్లాలో మరణాలు కూడా సంభవించాయి. నేటికీ డెంగ్యూ బాధితులు అనేకమంది ఆసుపత్రుల్లో చికిత్సలు పొందుతున్నారు. ఈ ఏడాది, గత రెండు నెలల్లోనే దాదాపు 250 డెంగ్యూ కేసులు వచ్చాయని ప్రభుత్వ వైద్యుల గణాంకాలే చెప్తున్నాయి. ఒక చిన్న దోమ కుడితే వచ్చే ఈ డెంగ్యూ వ్యాధి..నిర్లక్ష్యంగా ఉంటే ఏకంగా మనిషి ప్రాణాల్నే తీసేస్తుందంటే చూడండి..అవెంత విషపు దోమలుగా ఉంటాయో. చిన్న దోమే కదా..అదేం చేస్తుందిలే అనుకుంటే, అది చివరికి మన ప్రాణాల్ని కూడా తీసేస్తుందన్న విషయం గుర్తుంచుకోవాలి. అందులోనూ మన నెల్లూరు దోమలకు ప్రసిద్ధి. ఎక్కడచూసినా దోమలపుట్టలే. అందులో డెంగ్యూవ్యాధికి కారణమైన 'ఎడిస్' అనే దోమలు కుట్టాయంటే..ఆసుపత్రిలో 'పడక' తప్పదు. ముఖ్యంగా 'ఎడిస్' అనే రకం దోమ కుట్టడం ద్వారా దాని నోటినుంచి వైరస్ మన శరీరంలోకి వచ్చి, అదే డెంగ్యూ వ్యాధిగా పరిణమిస్తుంది. డెంగ్యూ వచ్చిందంటే అనేకబాధలు పడాల్సి ఉంటుంది. అయితే ఆ రకం దోమలను ప్రత్యేకించి మనం గుర్తించలేం కనుక, మొత్తంగా దోమల బారినపడకుండా జాగ్రత్తలు తీసుకోవాల్సి ఉంటుంది. దోమలు లేకుండా చేయడమంటే పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవడం ఒక్కటే మార్గం.

### వ్యాధి లక్షణాలివీ!...

డెంగ్యూ వ్యాధి పట్ల ప్రతిఒక్కరికీ అవగాహన ఉండాలి. చిన్నపిల్లలు, పెద్దవాళ్ళు మన ఇళ్లలో ఉంటారు. వారి ఆరోగ్యం ఎలా ఉందో ఎప్పటికప్పుడు గమనిస్తుండాలి. జ్వరం తీవ్రంగా రావడం, విపరీతమైన తలనొప్పి, నడుము కిందిభాగంలో బాగా నొప్పిగా ఉండడం, ఒళ్ళునొప్పులు, కళ్ళునొప్పులు, కీళ్లు నొప్పులు ఉండడం వంటివన్నీ

## సమస్యల తో 'రణం'

డెంగ్యూ వ్యాధి లక్షణాలు. జ్వరం వస్తే తగ్గిపోతుందిలే అనుకుని తాత్సారం చేస్తే..చాలా ప్రమాదం. డెంగ్యూ వ్యాధి వచ్చాక దాన్నుంచి బయటపడాలంటే ఎంతో కష్టం. ఎంతో వ్యయప్రయాసలు పడాల్సి ఉంటుంది. డెంగ్యూతో పాటు రక్తస్రావం కావడం (డెంగ్యూ హెమరేజ్), రక్తపోటు అతితక్కువకు పడిపోవడం, రక్తంలో ప్లేట్‌లెట్స్ గణనీయంగా తగ్గిపోవడం ద్వారా రోగికి ప్రాణాపాయం కూడా ఉంటుంది. అందువల్ల నిర్లక్ష్యంగా ఉండకుండా, వ్యాధి లక్షణాలను గుర్తించాలి. ఆ వ్యాధి వచ్చిందా లేదా అని నిర్ధారించుకోవాలంటే ప్రభుత్వాసుపత్రుల్లో 'ఎలిషా' అనే వైద్య పరీక్ష చేసి వ్యాధిని నిర్ధారిస్తారు. జిల్లా వ్యాప్తంగా ఉన్న 52 ప్రాథమిక ప్రభుత్వఆరోగ్య కేంద్రాల్లోను, 10 సామాజిక ఆరోగ్యకేంద్రాలు, 2 ఏరియా ఆసుపత్రులు, ఒక జిల్లా ఆసుపత్రితో పాటు నెల్లూరు నగరంలోని ప్రభుత్వ సర్వజన వైద్యశాల (పెద్దాసుపత్రి)లోనూ ఎలిషా పరీక్ష అందుబాటులో ఉంది. వ్యాధిని ప్రాథమిక దశలోనే గుర్తిస్తే, దాని నుంచి బయటపడేందుకు అవకాశం ఉంటుంది కూడా.

### దోమల వల్లనే వ్యాధులు

దోమల వల్ల అనేకరకాలైన వ్యాధులు వస్తుంటాయి. వాటిలో డెంగ్యూ ఒకటి. మురుగు దిబ్బలకి, చెత్తకుప్పలకి నిలయమైన నెల్లూరులో దోమలు కుప్పలుతెప్పలుగా ఉంటాయి. ఏరకం దోమల మందు వాడినా, అవి వాటికి అలవాటైపోతున్నాయే తప్ప, మందులకి మలబడడం లేదు. కార్పొరేషన్ వాళ్ళు దోమల నివారణకు ఫాగింగ్ చేస్తామంటారు కానీ చేసిందెక్కడ?..పన్నుల వసూలులో ఉన్న శ్రద్ధ ప్రజారోగ్యంపై పెడుతున్నారా?..అసలే, నెల్లూరు నగరం మురుగుకంపు కొడుతోంది. ఎక్కడ చూసినా మురుగుదిబ్బలు, కంపుకాల్వలే. జిల్లాలో ఎక్కడ చూసినా అపరిశుభ్ర వాతావరణమే. ఇది 'దోమల జిల్లా' కాక మరేమవుతుంది. 'స్వచ్ఛ నెల్లూరు' వంటివన్నీ ప్రజలను ఏమార్చే నినాదాలే తప్ప ఏ ప్రాంతం పచ్చగా బాగుందో చెప్పండి!..మురుగు కాలువలు, నీటిమడుగులు, నీటి నిల్వ ఉండేప్రాంతాలు, కొబ్బరిబోండాలు తాగి పారేసిన తర్వాత వాటి డొప్పలు, కొబ్బరిచిప్పలు, ఖాళీప్రదేశాల్లో ఉన్న మురుగుదిబ్బలు.. ఇలాంటివన్నీ ఈ డెంగ్యూ దోమలకు ఆవాసాలుగా ఉంటాయన్నది అధికారులకు తెలిసిందే కదా. అయినా దోమల నివారణకు ఎందుకు సంకల్పించలేకపోతున్నాం. గతంలో దోమలను తరిమేస్తామని 'టాస్క్‌ఫోర్స్' కూడా వేశారు. జనం కళ్లనీళ్లు తుడవడానికి ఎప్పటికప్పుడు లేనిపోని మాయమాటలు చెప్తున్నారే తప్ప..ఆచరణలో ఏమీ జరగడం లేదనే సంగతి అందరికీ తెలిసిందే. డెంగ్యూ అనేది ప్రాణాలు తీసే వ్యాధి అనీ, జాగ్రత్తగా ఉండాలని, చుట్టూ ఉన్న పరిసరాలను పరిశుభ్రం చేసుకోండనీ వైద్యనిపుణులు ఎంతోకాలంగా నెత్తీనోరు మొత్తుకుంటున్నా మన జిల్లాలో...ఎవరికీ దోమ కుట్టినట్లు కూడా ఉండడం లేదు. వ్యాధులు వచ్చినవాళ్లు మాత్రం ఆసుపత్రుల చుట్టూ తిరుగుతూ, నానా బాధలు పడుతున్నారు. ఇకనైనా అధికారులు, ప్రజలు సమన్వయంగా కలసి, ఒక ప్రణాళిక ప్రకారం కార్యాచరణకు దిగితే మురుగుదిబ్బలను తొలగించుకోవడం పెద్ద పనా?..అనుకుంటే చేయలేమా?.. ప్రయత్నించండి! ప్రజలు డెంగ్యూ దోమల బారినపడి బాధలు పడకుండా ఉండాలంటే.. ఏం చేస్తే బాగుంటుందో అందరూ కలసి.. ఇకనైనా.. ఆలోచించండి!

- సంచారి

# మృతుని కుటుంబాన్ని ఆదుకున్న ఎమ్మెల్యే ప్రసన్న

## ఎన్ఎస్ఆర్ ట్రస్టు ద్వారా రూ. లక్ష సాయం



కోవూరు మండలం పడుగుపాడు గ్రామానికి చెందిన వైకాపా సీనియర్ నాయకుడు అన్ను ఇటీవల మృతిచెందడంతో, ఆ కుటుంబం ఆర్థిక ఇబ్బందులతో సతమతమవుతున్న విషయాన్ని తెలుసుకున్న కోవూరు ఎమ్మెల్యే ప్రసన్న, మృతుని కుటుంబానికి అండగా నిలిచారు. తమ తండ్రి దివంగత నేత స్వర్గీయ నల్లపరెడ్డి శ్రీనివాసులురెడ్డి చారిటబుల్ ట్రస్ట్ ద్వారా లక్ష రూపాయల సాయాన్ని ఆ కుటుంబసభ్యులు అందించి తన ఔదార్యాన్ని చాటుకున్నారు. ఈ సందర్భంగా మృతుని కుటుంబసభ్యులు ఎమ్మెల్యేకి తమ కృతజ్ఞతలు తెలుపుకున్నారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర వ్యవసాయ సలహామండలి ఛైర్మన్ దొడ్డంరెడ్డి నిరంజన్‌బాబురెడ్డి, కోవూరు ఏఎంసి ఛైర్మన్ రాధాకృష్ణారెడ్డి, పడుగుపాడు సొసైటీ ఛైర్మన్ మల్లికార్జునరెడ్డి, డిఎల్‌డిఏ డైరెక్టర్ కె.దినేష్‌రెడ్డి, పడుగుపాడు ఉప సర్పంచ్ అహ్మద్ తదితరులు పాల్గొన్నారు.

# ప్రకృతి వనరులను కాపాడుకోవాలి

## --- అటవీశాఖ అధికారి మోహన్‌రావు ---




ప్రకృతి వనరులను కాపాడుకోవాలే తప్ప నాశనం చేయకూడదని, ప్రకృతిని పర్యావరణాన్ని పరిరక్షించుకుంటామంటూ కావలి అటవీ క్షేత్రాధికారి వై.మోహన్‌రావు పర్యాటకులతో ప్రతిజ్ఞ చేయించారు. ఈనెల 15న కావలి రూరల్‌లోని తుమ్మలపెంట బీచ్‌లో ఆయన పర్యాటకులను కలసి ప్రకృతి వల్ల కలిగే ఉపయోగాలను వారికి వివరించారు. 'లైఫ్' పేరుతో పోస్టర్లను ప్రదర్శించి పర్యాటకులకు అవగాహన కలిగించారు. మానవ మనుగడ ప్రకృతిపైనే ఆధారపడి ఉందనే విషయాన్ని గుర్తుంచుకోవాలని, ఎవరూ ప్రకృతి విధ్వంసానికి పాల్పడకూడదని చెప్పారు. సాగరతీరాల్లోనూ, బీచ్‌లలోనూ వ్యర్థాలను ఎక్కడంటే అక్కడ వేయవద్దని, నిర్దిష్ట ప్రదేశాల్లోనే వేయాలని, సాగర జలాలను కలుషితం చేయవద్దని సూచించారు. ఈ కార్యక్రమంలో అటవీశాఖ సిబ్బందితో పాటు గ్రామస్తులు పాల్గొన్నారు.

# ఐక్యతతోనే ప్రగతి సాధ్యం

## దేవాదాయ ధర్మాదాయశాఖ సలహాదారు శ్రీకాంత్



రాష్ట్రంలో బ్రాహ్మణ సంఘీయులు ఐక్యంగా ఉంటేనే సామాజిక, ఆర్థిక, రాజకీయ రంగాల్లో బ్రాహ్మణులకు ప్రగతి సాధ్యమవుతుందని రాష్ట్ర దేవాదాయ ధర్మాదాయశాఖ సలహాదారు, ఆపన్న ప్రదీపన బ్రాహ్మణ సేవా సంఘ సమాఖ్య రాష్ట్ర అధ్యక్షుడు జ్వాలాపురం శ్రీకాంత్ అన్నారు. ఈనెల 16న నెల్లూరులోని పురమందిరంలో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి బ్రాహ్మణులకు అండగా ఉన్నారని, వైకాపా పాలనలోనే బ్రాహ్మణసంఘీయులకు సంక్షేమం ఉంటుందని చెప్పారు. బ్రాహ్మణ, అర్చక సమస్యల పరిష్కారానికి తనవంతు కృషిచేస్తానని ఆయన హామీ ఇచ్చారు. నెల్లూరుజిల్లా బ్రాహ్మణసేవా సంఘ సమాఖ్య అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు శ్రీధర్‌శర్మ, ముఖ్వా ప్రసాద్ ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం జరిగింది. నెల్లూరు ఆర్డీఓ మలోల, వివిధ జిల్లాల నాయకులు మాట్లాడారు. అనంతరం, జ్వాలాపురం శ్రీకాంత్‌కు, బ్రాహ్మణ కార్పొరేషన్ డైరెక్టర్లు ఎనమండ్ర సాయిసురేష్, పూర్ణానందశర్మ, పోతావఝుల పురుషోత్తమ శర్మలను నిర్వాహకులు అభినందించి సత్కారాలు చేశారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న నెల్లూరు గ్రామదేవత శ్రీ ఇరుకళల పరమేశ్వరి అమ్మవారి ఆలయం కమిటీ ఛైర్మన్ ఆర్ శ్రీనివాసరావు (ఆర్ఎస్ఆర్) జ్వాలాపురం శ్రీకాంత్‌ను ఆత్మీయంగా సన్మానించారు. ఆలయ అర్చకులు దైవజ్ఞస్వామి పాల్గొని శ్రీకాంత్‌ను ఆశీర్వదించారు. ఆలయ ఇఓ బి.మల్లికార్జునరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# అసాంఘికశక్తుల ఆట కట్టించండి

## • పోలీసులకు జిల్లా ఎస్పీ తిరుమలేశ్వరరెడ్డి ఆదేశం



జిల్లాలో రౌడీషీటర్లు, అసాంఘికశక్తుల ఆగడాలను అరికట్టాలని, నేరాలకు ఘోరాలకు పాల్పడేవారిని ఎట్టి పరిస్థితుల్లోనూ ఉపేక్షించవద్దని జిల్లా ఎస్పీ తిరుమలేశ్వర రెడ్డి ఆదేశించారు. ఈనెల 16న ఆయన నగరంలోని నవాబుపేట పోలీస్‌స్టేషన్‌ను ఆకస్మికంగా తనిఖీ చేశారు. రికార్డులను పరిశీలించారు. పోలీస్‌స్టేషన్‌లోని అన్ని విభాగాలను కూలంకుషంగా పరిశీలించి పోలీసు సిబ్బందికి తగు సూచనలిచ్చారు. పగలు-రాత్రి గస్తీని ముమ్మరం చేసి నేరాలను కట్టడి చేయాలన్నారు. వేసవి దృష్ట్యా దొంగతనాలు జరగకుండా నిఘా పెట్టాలన్నారు. పాత నేరస్తుల కదలికలను ఎప్పటికప్పుడు గమనిస్తుండాలని సూచించారు. ఎల్‌హెచ్ఎమ్మెస్ సేవలపై ప్రజలకు అవగాహన కలిగించాలని, చోరీ కేసుల్లో నిందితులను అరెస్ట్ చేసి వారినుంచి సొత్తును రికవరీ చేసేందుకు కృషిచేయాలని చెప్పారు. మహిళలు, చిన్నారుల రక్షణ కోసం ఏర్పాటుచేసిన 'దిశ' యాప్‌పై మహిళలకు అవగాహన కలిగించాలన్నారు. మిస్సింగ్ కేసుల్లో ఫిర్యాదు అందిన వెంటనే కేసు నమోదు చేసి, అదృశ్యమైన వారిని త్వరితగతిన గుర్తించాలని, వివిధ కేసుల్లో పట్టుబడిన వాహనాలను కోర్టు అనుమతితో వేలం వేయాలని పోలీసు సిబ్బందికి సూచించారు. ఇన్స్‌పెక్టర్ సుబ్బారావు తదితరులు పాల్గొన్నారు.

### ఉత్తమ విద్యార్థులకు..

# 28న నగదు పురస్కారాలు

నెల్లూరు నగరపాలక సంస్థ ఉన్నత పాఠశాలల్లో చదువుకుంటూ, పదోతరగతి పరీక్షల్లో 550పైగా మార్కులు సాధించిన విద్యార్థులకు డాక్టర్ మాదాల వెంకటేశ్వర రావు-సుజాతమ్మ చారిటబుల్ ట్రస్ట్ ద్వారా ఈనెల 28న ప్రోత్సాహక నగదు పురస్కారాలను అందజేయనున్నామని ట్రస్ట్ ఛైర్మన్ మాదాల వెంకటేశ్వరరావు ఒక ప్రకటనలో తెలిపారు. నగరంలోని పొగతోటలో ఉన్న సమతా నర్సింగ్‌హోమ్‌లో ఆరోజున జరిగే కార్యక్రమంలో ఉత్తమ మార్కులు సాధించినవారితో పాటు, 550 మార్కులు రాని ఉన్నత పాఠశాలల్లో స్కూల్ టాపర్ ఒకరికి వంతున నగదు బహుమతులిస్తామన్నారు. విద్యార్థులు తమ మార్కుల మెమోతో, ఈనెల 24వతేదీ లోపు తమ పేర్లు నమోదు చేసుకోవాలని కోరారు. వివరాలకు 94923 38449 ఫోన్ నెంబరుకు సంప్రదించవచ్చని ఆయన పేర్కొన్నారు.

### శ్రీలక్ష్మీ వేంకటేశ్వరునికి..

# కల్పవృక్ష వాహన సేవ



పొదలకూరులో కొలువైవున్న శ్రీలక్ష్మీ వేంకటేశ్వరస్వామి దేవాలయంలో జరుగుతున్న తొలి వార్షిక బ్రహ్మోత్సవాల్లో భాగంగా 5వ రోజైన ఈనెల 16న ఆలయ అర్చకులు శ్రీవారికి కన్నులపండువగా కల్పవృక్ష వాహనోత్సవం, అశ్వవాహనోత్సవాలను నిర్వహించారు. పెద్ద సంఖ్యలో భక్తులు పాల్గొని స్వామివారిని-అమ్మవారిని దర్శించుకున్నారు. ఈ ఉత్సవాలకు ఉభయకర్తలుగా ఆకులూరు మధు, నీరజ, ఆకులూరు హేమంత్, అనూరాధ, మన్నెం కోటేశ్వరరావు, శేషమ్మ, దాసినేని ప్రసాద్ నాయుడు, పుష్పలత, చంద్రశేఖర్, ఆనందమ్మ, శ్రీనివాసులు, శ్రీలక్ష్మీ వెంకట సుకన్య, సింహాచలం, బుజ్జమ్మ తదితరులు వ్యవహరించారు.

# విద్యార్థుల్లో సామాజిక స్పృహను పెంపొందించాలి



విద్యార్థుల్లో సామాజిక స్పృహ పెంపొందేవిధంగా, సమాజాభ్యున్నతికి వారు పాటుపడే విధంగా తీర్చిదిద్దాలని విక్రమసింహపురి విశ్వవిద్యాలయం ఉపకులపతి ఆచార్య జిఎం సుందరవల్లి అధ్యాపకవర్గానికి, ఆయా కళాశాలల యాజమాన్యాలకు సూచించారు. ఈనెల 16న విశ్వవిద్యాలయంలోని కమ్యూనిటీ సర్వీసెస్ ప్రాజెక్టుపై ప్రభుత్వ, ప్రైవేట్ అధ్యాపకులకు నిర్వహించిన అవగాహన సదస్సులో ఆమె మాట్లాడారు. సమాజాభివృద్ధికి పాటుపడాలనే ఉద్దేశంతో ఏర్పాటుచేసిన కమ్యూనిటీ సర్వీసెస్ ప్రాజెక్టును రాష్ట్ర ప్రభుత్వం ఎంతో ప్రతిష్టాత్మకంగా భావిస్తోందని, ఆ ప్రాజెక్టును పటిష్టవంతంగా అమలుచేసే బాధ్యతను కళాశాలల యాజమాన్యాలు సమర్థవంతంగా చేపట్టాలని సూచించారు. ఈ కార్యక్రమంలో వివిఎస్‌యు రిజిస్ట్రార్ డా.పి.రామచంద్రారెడ్డి, అధ్యాపకులు పాల్గొన్నారు.

# ఆటో కార్మికులకు క్రికెట్ పోటీలు



ఆటో కార్మికులకు ఆట విడుపుగా ఉండేందుకు నెల్లూరులోని సిఐటియు ఆధ్వర్యంలో ఆటోకార్మిక సంఘం నగర కమిటీ నేతృత్వంలో క్రికెట్ పోటీలు నిర్వహించారు. ఈనెల 16న స్థానిక విఆర్‌సి మైదానంలో ఆ పోటీలను నగర ట్రాఫిక్ డిఎస్పీ సుబహాన్ ప్రారంభించారు. క్రీడల్లో పాల్గొంటున్నవారిని ఆయన అభినందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆటోడ్రైవర్లు వృత్తిపరంగా వత్తిడికి గురికాకుండా ఈ క్రీడలు దోహదం చేస్తాయని, అయితే ఈ మండుటెండల్లో ఇబ్బందులు పడకుండా జాగ్రత్తలు పాటించాలని చెప్పారు. మే డే పురస్కరించుకుని జరుగుతున్న ఈ క్రీడల్లో మొత్తం 10 జట్లు పాల్గొంటున్నాయని, ఈనెల 30న సిఐటియు ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా నగరంలోని పప్పులవీధి పార్కులో విజేతలకు బహుమతులను ప్రదానం చేస్తామని చెప్పారు. ఈ నాలుగు రోజులు క్రికెట్‌తో పాటు రివర్స్‌గేర్ ఆటో, మ్యూజికల్ ఛైర్ వంటి పోటీలు కూడా నిర్వహిస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో పోటీల నిర్వాహక అధ్యక్ష కార్యదర్శులు రాజా, సురేష్, సిఐటియు నాయకులు సూర్యనారాయణ, సుధాకర్, నాగూరు, వెంగయ్య, మురళి, హబీబ్, బాబురావు, జగదీష్, చరణ్ తదితరులు పాల్గొన్నారు.

# ఉద్యోగుల సమస్యల సాధన కోసం..22 నుంచి ఉద్యమం

ప్రభుత్వోద్యోగుల సమస్యల సాధన కోసం ఈనెల 22 నుంచి దశలవారీగా ఉద్యమ కార్యాచరణను నిర్వహిస్తామని ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వోద్యోగుల సంఘం (ఏపీజిఇఏ) రాష్ట్ర సలహామండలి ఛైర్మన్ రవీంద్రబాబు, జిల్లా అధ్యక్షుడు రమణారెడ్డిలు చెప్పారు. ఇటీవల నెల్లూరులోని ఐఎంఏ హాల్‌లో జరిగిన ఆ సంఘం సమావేశంలో వారు ఉద్యమ కార్యాచరణకు సంబంధించిన కరపత్రాలను ఆవిష్కరించారు. ఆ సంఘం రాష్ట్ర కార్యదర్శి శ్రీనివాసులురెడ్డి తదితరులు పాల్గొన్నారు.




## జిల్లా రెడ్‌క్రాస్ ఛైర్మెన్‌గా..
# మళ్లీ పర్వతరెడ్డి విజయం

జిల్లాలో ఈనెల 15న ఎంతో ఉత్కంఠభరితంగా జరిగిన రెడ్‌క్రాస్ ఎన్నికల ఓట్ల లెక్కింపులో ఎమ్మెల్సీ పర్వతరెడ్డి చంద్రశేఖర్‌రెడ్డి సేవా ప్యానెల్ ఘన విజయం సాధించింది. దీంతో చంద్రశేఖర్‌రెడ్డి రెండవసారి జిల్లా రెడ్‌క్రాస్ ఛైర్మెన్‌గా ఎన్నిక కావడంతో ఆ ప్యానెల్ సభ్యుల్లో సంతోషం వెల్లువెత్తింది. రెడ్‌క్రాస్ పాలకవర్గం మూడేళ్ల పదవీకాలం గత ఫిబ్రవరి 2023తో ముగియడం, జిల్లా కలెక్టర్ ఆదేశాలతో డిఆర్‌ఓ వెంకట నారాయణమ్మ రెండునెలల పాటు పాలన బాధ్యతలు స్వీకరించడం, గత ఏప్రిల్ 2న జిల్లా రెడ్‌క్రాస్ సంస్థకు ఎన్నికలు నిర్వహించడం, 34 మంది సభ్యులు పోటీపడడం తెలిసిందే. ఇందులో సేవా ప్యానెల్ తరపున ఎమ్మెల్సీ పర్వతరెడ్డి చంద్రశేఖర్‌రెడ్డి 15 మంది సభ్యులతో పోటీకి దిగారు.

అయితే ఆ ఎన్నికలు నిబంధనలకు విరుద్ధంగా జరిగాయంటూ మరో వర్గానికి చెందిన న్యాయవాది మక్కెన అంకయ్యచౌదరి తదితరులు కోర్టుకు వెళ్లడంతో, కోర్టు కౌంటింగ్‌ను నిలిపివేసింది. దీంతో ఒకటిన్నర నెల పాటు కౌంటింగ్ నిలిచిపోయింది. ఆ తర్వాత, కోర్టు తుది తీర్పుకు లోబడి కౌంటింగ్ నిర్వహించుకోవచ్చని ఇటీవల కోర్టు సూచించడంతో ఈనెల 15న జిల్లా సహకారశాఖ అధికారి సుధాభారతి ఆధ్వర్యంలో కౌంటింగ్ నిర్వహించారు.

ఓట్ల లెక్కింపులో ప్రతి రౌండ్‌లోనూ సేవా ప్యానెల్ తన ఆధిక్యాన్ని నిలబెట్టుకుంటూ విజయం సాధించింది. సేవా ప్యానెల్‌కు చెందిన పర్వతరెడ్డి చంద్రశేఖర్‌రెడ్డి, మలిరెడ్డి కోటారెడ్డి, ఎంవి సుబ్బారెడ్డి, గునుపాటి ప్రసాద్‌రెడ్డి, దాసరి రాజేంద్రప్రసాద్, యాలమూరి రంగారావు, బయ్యా ప్రసాద్, సిహెచ్ జనార్దన్‌రాజు, శ్రీహరిరెడ్డి, వి.విజయకుమార్‌రెడ్డి, డి.సుధీర్‌నాయుడు, జి.ప్రసన్నాంజనేయులు, యడవల్లి సురేష్, డి.రవిప్రకాష్, సురేష్‌కుమార్ జైన్‌లు విజయం సాధించినట్లు ప్రకటించారు. ఆ తర్వాత సభ్యులందరూ కలిసి ఎమ్మెల్సీ పర్వతరెడ్డి చంద్రశేఖర్‌రెడ్డిని జిల్లా రెడ్‌క్రాస్ ఛైర్మెన్‌గా, సురేష్‌కుమార్ జైన్‌ను కోశాధికారిగా ఎన్నుకున్నారు. రెడ్‌క్రాస్‌కు గతంలో కన్నా మెరుగైన సేవలందిస్తామని ఈ సందర్భంగా చంద్రశేఖర్‌రెడ్డి చెప్పారు.

## నెల్లూరు కబుర్లు

## డెంగ్యూపై అవగాహన ర్యాలీ



జాతీయ డెంగ్యూ నివారణ సందర్భాన్ని పురస్కరించుకుని మే 16న నెల్లూరు నగరంలో డిఎంఅండ్‌హెచ్‌ఓ పెంచలయ్య ఆధ్వర్యంలో భారీ ర్యాలీ నిర్వహించి, ప్రజలకు డెంగ్యూ వ్యాధిపట్ల అవగాహన కలిగించారు. తొలుత జెండావూపి, ఆయన ర్యాలీని ప్రారంభించారు. నీటి నిల్వలు లేకుండా చూసుకోవాలని, పరిసరాలు పరిశుభ్రంగా ఉండేలా చూడాలని, దోమలను నివారించాలని సంబంధిత సిబ్బందికి సూచించారు. జిల్లా డెంగ్యూ నివారణ అధికారి డాక్టర్ బ్రిజిత, డాక్టర్ సునీల్, పిఎంపిల సంఘం అధ్యక్షుడు వేణుగోపాల్, డెమో అధికారి శ్రీనివాసులు, డెప్యూటీ డెమో కనకరత్నం, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

## వాకర్స్.. మదర్స్ డే



మదర్స్ డే సందర్భంగా ఈనెల 15న నెల్లూరులోని ఏసి సుబ్బారెడ్డి స్టేడియం మహిళా వాకర్స్ ఆధ్వర్యంలో పలువురు మాతృమూర్తులను సత్కరించారు. అసోసియేషన్ అధ్యక్షురాలు భారతి ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో వాకర్స్ డిస్ట్రిక్ట్ గవర్నర్ వెంకట్రామిరెడ్డి, నలుబోలు బలరామయ్యనాయుడు, అరుణాచలం, నరసింహారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## ప్రమాణస్వీకారోత్సవాన...
# ఎమ్మెల్సీ మురళికి ఆర్ఎస్ఆర్ సన్మానం



మే 15వ తేదీన అమరావతిలోని శాసనమండలి ప్రాంగణంలో జరిగిన కార్యక్రమంలో నెల్లూరు ఎమ్మెల్సీగా ఏకగ్రీవంగా ఎన్నికైన మేరిగ మురళి ప్రమాణస్వీకారం చేశారు. ఈ సందర్భంగా ఆయన్ను పలువురు ప్రముఖులు దుశ్శాలువలతో సన్మానించారు. ఈ సందర్భంగా నెల్లూరులోని 20వ డివిజన్ వైకాపా సీనియర్ నాయకులు, నెల్లూరు గ్రామదేవత శ్రీ ఇరుకళల పరమేశ్వరి అమ్మవారి ఆలయ ట్రస్ట్ బోర్డ్ ఛైర్మెన్‌రావు శ్రీనివాసరావు (ఆర్ఎస్ఆర్), నెల్లూరు నగర ఎస్.సి సెల్ అధ్యక్షుడు తాళ్లూరి సురేష్‌బాబు, 19వ డివిజన్ సీనియర్ నాయకుడు వరాల లక్ష్మీ నారాయణ, పుట్టా రూపేష్, కోవూరు ప్రకాష్, బట్టా బాబు తదితరులు పాల్గొని మేరిగ మురళిని ఆత్మీయంగా సత్కరించారు.

## నెల్లూరుకు 'కంటైనర్ సబ్‌స్టేషన్' మంజూరు

**- ఏపిఎస్పీడిసిఎల్ సిఎండి సంతోష్‌రావు**



నెల్లూరు నగరానికి కంటైనర్ సబ్‌స్టేషన్ మంజూరైందని, ఏపిఎస్పీడిసిఎల్ పరిధిలో ఎక్కడాలేని విధంగా నెల్లూరుకు ఆ ప్రత్యేకమైన విద్యుత్ సబ్‌స్టేషన్ మంజూరుకావడం విశేషమని ఏపిఎస్పీడిసిఎల్ సిఎండి సంతోష్‌కుమార్ వెల్లడించారు. ఇటీవల ఆయన నెల్లూరు విద్యుత్‌భవన్‌లో ఏర్పాటుచేసిన జిల్లా విద్యుత్ అధికారుల సమావేశంలో మాట్లాడారు. విద్యుత్ ఉద్యోగులు, అధికారులు క్రమశిక్షణతో వినియోగదారులకు సేవలందించాలని, నిర్దేశించిన ప్రాంతాల్లోనే నివాసం ఉండాలని, లేదంటే వారికి హెచ్ఆర్ఏ (హౌస్ రెంట్ అలవెన్స్)ను నిలుపుదల చేయాలని అధికారులను ఆదేశించారు. జిల్లాలో ఎక్కడా లోఓల్టేజీ సమస్యలు రాకుండా చూడాలని, అవసరమైతే అదనపు విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్ల ఏర్పాటుకు ప్రతిపాదనలు పంపాలని చెప్పారు. అదేవిధంగా, ఎక్కడా విద్యుత్ ప్రమాదాలు జరగకుండా పర్యవేక్షిస్తుండాలని అధికారులకు సూచించారు ఈ సమావేశంలో విద్యుత్‌శాఖ డైరెక్టర్లు ఎన్‌వియస్ సుబ్బరాజు, శివప్రసాద్‌రెడ్డి, వివిఎస్ బాబు, చీఫ్ జనరల్ మేనేజర్లు గురవయ్య, ధర్మజ్ఞాని, జిల్లా విద్యుత్‌శాఖ ఎస్ఇ వెంకటసుబ్బయ్య తదితరులు పాల్గొన్నారు.

# 'తంగిరాల మహాభారతం' 55వ భాగం




ఒకరోజు ఒక విప్రుని ఇంట్లో దొంగలు జొరబడి గోవులను ఎత్తుకు పోతే... ఆ బ్రాహ్మణుడు భోరు భోరున ఏడుస్తూ అర్జునుని దగ్గరకు వచ్చి రక్షించమంటాడు. అర్జునుడు ఆలోచనలో పడతాడు తన విల్లంబులు ధర్మరాజు అంతఃపురంలో ఉన్నాయని. కానీ, ఆ బ్రాహ్మణుడు విలపిస్తుంటే, రాజుగా తన రాజధర్మం గుర్తించి, అంతఃపురంలోకి వెళ్లి ఆయుధాలు తీసుకుని దొంగల బారి నుంచి గోవులను రక్షిస్తాడు. కానీ, వచ్చి ధర్మరాజుకి తాము పెట్టుకున్న నియమాన్ని ఉల్లంఘించానని 12 నెలలు తీర్థయాత్రలకు బయలుదేరుతాడు. గంగాతీరానికి చేరుకున్నప్పుడు, ఉలూచి అనే నాగకన్య అర్జునుణ్ణి చూసి మోహించి తన నాగలోకానికి తీసుకువెళుతుంది. కానీ తాను బ్రహ్మచర్య దీక్షలో ఉన్నానని చెప్పినప్పుడు, ఉలూచి మీరు పెట్టుకున్న నియమం ద్రౌపది విషయానికి సంబంధించినదని, తనని స్వీకరించమని లేనిచో ప్రాణ త్యాగం చేస్తానని చెప్పినప్పుడు అంగీకరించి ఆమెతో గడిపి, తర్వాత ఐరావతుణ్ణి కంటారు.

అర్జునుడు తన తీర్థయాత్రలని కొనసాగించి, మణిపురం ప్రవేశించి, ఆ దేశ రాజయిన చిత్రవాహనుని కూతురు చిత్రాంగదని చూసి మోహిస్తాడు. చిత్రవాహనుడు అంగీకరించి, కానీ వాళ్లకు పుట్టిన పిల్లాడు తన వంశానికి వారసుడు కావాలని కోరతాడు. దానికి అర్జునుడు అంగీకరించి చిత్రాంగదని వివాహమాడతాడు. వారికి బభ్రువాహనుడు జన్మిస్తాడు.

భారత కాలమానం ప్రకారం ప్రతి శనివారం ఉదయం యూట్యూబ్‌లో తంగిరాల 'మహాభారతం' అందుబాటులోకి వస్తుంది.
పూర్తి నిడివి కోసం
Syam Tangirala Mahabharatam
@YouTubeలో చూడగలరు.




## ప్రైవేట్ కాలేజీలపై
# చర్యలు తీసుకోవాలి

వేసవి సెలవుల్లో తరగతులు నిర్వహిస్తున్న ప్రైవేట్ కళాశాలల వారిపై చర్యలు తీసుకోవాలంటూ ఎస్ఎఫ్ఐ నెల్లూరు రూరల్‌శాఖ అధ్యక్షుడు బి. సుకుమార్ డిమాండ్ చేశారు. ఇటీవల ఆయన కళాశాలలను సందర్శించి, తరగతులు నిర్వహిస్తున్న కళాశాలల యాజమాన్యాల తీరు పట్ల నిరసన వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ నాయకులు సిసింద్రీ, లోకేష్, సోను, శివ, సిద్ధు తదితరులు పాల్గొన్నారు.

## స్కానింగ్ కేంద్రాల తనిఖీ

నెల్లూరులోని పలు స్కానింగ్ సెంటర్లను వైద్యశాఖ పీసీ, పిఎన్‌డిటి ప్రోగ్రాం అధికారులు తనిఖీ చేశారు. ఆయా సెంటర్లలో రికార్డులు, స్కానింగ్ యంత్రాల పనితీరును పరిశీలించి, సిబ్బందికి సూచనలిచ్చారు. ఈ తనిఖీల్లో డెమో అధి కారి బి.శ్రీనివాసరావు, డెప్యూటీ డెమో కనకరత్నం తదితరులు పాల్గొన్నారు.

## శబరి శ్రీరామక్షేత్రంలో ప్రత్యేక పూజలు

హనుమత్‌జయంతిని పురస్కరించుకుని నెల్లూరు దర్గామిట్టలో ఉన్న శబరి శ్రీరామక్షేత్రంలో ఇటీవల విశేష పూజలు నిర్వహించారు. లక్ష మల్లెలతో శ్రీ ఆంజనేయస్వామికి సామూహిక అర్చనలు చేశారు. చిన్నపిల్లలకు స్వామివారి వెండి డాలర్లను బహుకరించారు. ఆలయ నిర్వాహకుల పర్యవేక్షణలో ఈ వేడుకలు వైభవంగా జరిగాయి.

# ఉపాధి హామీని నీరుగార్చకండి

**-- కార్మికసంఘాల నిరసన --**



పేదలకు పట్టెడన్నం పెడుతున్న ఉపాధి హామీ పథకాన్ని నీరుగార్చేందుకు కేంద్రప్రభుత్వం ప్రయత్నిస్తోందని ఆందోళన వ్యక్తం చేస్తూ నెల్లూరులో ఈనెల 15న కార్మిక సంఘం నాయకులు నిరసన ప్రదర్శన నిర్వహించారు. అనంతరం, వ్యవసాయ కార్మికసంఘం జిల్లా కార్యదర్శి పుల్లయ్య ఆధ్వర్యంలో వివిధ సంఘాల నాయకులు కలిసి ఆమేరకు జిల్లా కలెక్టర్ హరినారాయణన్‌కు వినతిపత్రం అందజేశారు. వ్యవసాయ కార్మికసంఘం జిల్లా అధ్యక్షుడు వెంకమరాజు, రైతు సంఘం జిల్లా కార్యదర్శి వెంగయ్య, తాళ్ళూరు మాల్యాద్రి, తిరుపాలు తదితరులు పాల్గొన్నారు.

# చుక్కల భూములకు విముక్తి

• కావలిలో సిఎం వైఎస్ జగన్

రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి ఈనెల 13న కావలికి వచ్చారు. అక్కడ ఏర్పాటుచేసిన సభలో ఆయన మాట్లాడారు. దాదాపు 97 వేల కుటుంబాలకు ఉపయోగపడే విధంగా చుక్కల భూములపై రైతులకు సంపూర్ణ హక్కులు కల్పిస్తూ ఆ మేరకు హక్కు పత్రాలను పంపిణీ చేశారు. రైతు బాగుంటేనే రాష్ట్రం బాగుంటుందని నమ్మిన ప్రభుత్వం మనదని, తన ప్రతి అడుగులోనూ రైతు సంక్షేమం ఉంటుందని చెప్పారు. రాష్ట్రంలో సుమారు 2,06,171 ఎకరాల చుక్కల భూములకు సంబంధించి రెవెన్యూ రికార్డుల్లో తగు మార్పులు చేసి, రైతులకు ఆ భూములపై సర్వహక్కులు కల్పించామని, రిజిస్ట్రేషన్ చట్టం సెక్షన్ 11-ఏ నుంచి వాటిని తొలగించామని తెలిపారు. దాదాపు నూరేళ్ళ క్రితం బ్రిటిష్‌వారి హయాం నుంచి రెవెన్యూ రికార్డుల్లో ఉన్న ఈ సమస్యను తమ ప్రభుత్వం పరిష్కరించిందన్నారు. సొంతభూమి ఉండి కూడా రెవెన్యూ రికార్డుల్లో చుక్కలుపెట్టి వాటిపై హక్కులు లేకుండా బాధలుపడుతున్న రైతాంగానికి నేటితో పరిష్కారం లభించిందన్నారు. ఒక్క నెల్లూరుజిల్లాలోనే సుమారు 43వేల ఎకరాలు, ప్రకాశం జిల్లాలో 37వేల ఎకరాలు, ఇలా రాష్ట్ర వ్యాప్తంగా సుమారు లక్ష కుటుంబాలకు ఇన్నేళ్ళకు ఈ సమస్య తొలగిపోయినట్లేని ముఖ్యమంత్రి వైఎస్ జగన్ అన్నారు.



## చంద్రబాబు డ్రామాలను నమ్మవద్దు

చంద్రబాబు పాలనలో రైతుల సమస్యలు గాలికొదిలేశారని, వ్యవసాయం దండగన్న చంద్రబాబు ఇప్పుడు ఎన్నికల కోసం రైతుబాంధవుని వేషంతో రోడ్డెక్కుతున్నాడని, వారికి మద్దతుగా ఈనాడు, ఆంధ్రజ్యోతి, టీవీ-5 వంటి రావణసైన్యం మద్దతుగా ఉన్నారని, చంద్రబాబు, పవన్‌కల్యాణ్, రామోజీరావు గజదొంగల ముఠా అని, దోపిడీగాళ్లని సిఎం ఈ సందర్భగా దుయ్యబట్టారు. రామాయణంలో శూర్పణఖ మాదిరిగా రైతులపై వారంతా దొంగప్రేమ నటిస్తున్నారని, అలాంటివారి డ్రామాలను నమ్మవద్దని కోరారు.

## కావలికి వరాలు

కావలి నియోజకవర్గానికి సంబంధించి ఎమ్మెల్యే రామిరెడ్డి ప్రతాప్‌రెడ్డి కోరిక మేరకు బ్యాలెన్సింగ్ రిజర్వాయర్‌కు 35 కోట్లు మంజూరుచేస్తున్నామని, అదేవిధంగా లింక్ కెనాల్‌కు 20కోట్లు, కావలి ట్రంక్‌రోడ్డు నిర్మాణ పనులకు మరో 15కోట్లు అదనంగా కేటాయిస్తున్నామంటూ.. కావలిపై సిఎం వరాల జల్లు కురిపించారు. కావలిలోని ఇందిరమ్మ కాలనీలో మౌలిక సదుపాయాల కల్పనకు 80 కోట్లు మంజూరుచేస్తున్నామని సిఎం చెప్పారు. ఈ సభలో మంత్రులు ధర్మాన ప్రసాదరావు, అంబటి రాంబాబు, కాకాణి గోవర్ధన్‌రెడ్డి, నెల్లూరు ఎంపీ ఆదాల ప్రభాకర్‌రెడ్డి, రాజ్యసభ సభ్యులు వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి, బీద మస్తాన్‌రావు, జడ్పీ ఛైర్‌పర్సన్ ఆనం అరుణమ్మ, ఎమ్మెల్యే రామిరెడ్డి ప్రతాప్‌కుమార్‌రెడ్డి, వైకాపా వెంకటగిరి నియోజకవర్గం సమన్వయకర్త నేదురుమల్లి రామ్‌కుమార్‌రెడ్డి, ఇంకా పలువురు ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు పాల్గొన్నారు.




## చెన్నై 'గ్లెనెగల్స్ గ్లోబల్'లో
# అరుదైన.. కాలేయమార్పిడి శస్త్రచికిత్స

చెన్నైలోని 'గ్లెనెగల్స్ గ్లోబల్ హెల్త్‌సిటీ' ఆసుపత్రిలో ఇటీవల ఓ రోగికి అరుదైన కాలేయమార్పిడి శస్త్ర చికిత్సను విజయవంతంగా నిర్వహించి రోగిని ప్రాణాపాయం నుంచి కాపాడారు. పుదుచ్చేరికి చెందిన వ్యాపారవేత్త జయరాజ్ జైన్ గత కొంతకాలంగా లివర్ సిర్రోసిస్ అనే వ్యాధితో ఆరోగ్యం క్షీణించి ప్రాణంమీదకు రావడంతో, ఆయనకు కాలేయమార్పిడి శస్త్రచికిత్స అవసరమని వైద్యులు నిర్ధారించారు. రోగి బరువు 170 కిలోలు కావడంతో కాలేయం మార్పిడితోనే రోగిని కాపాడవచ్చనే అంచనాకు వచ్చారు. కాలేయం ఇచ్చే దాత కోసం వైద్యులు ఎదురుచూస్తుండగా, రోగి భార్య, ఆయన సోదరుని కుమారుడు కూడా కాలేయమార్పిడికి అంగీకరించడంతో, వారిద్దరి కాలేయాలను పరీక్షించి, ఇరువురి కాలేయాలతో కాలేయమార్పిడి శస్త్రచికిత్సను అద్భుతంగా నిర్వహించి రోగిని కాపాడారు. గ్లెనిగల్ ఆసుపత్రి వైద్యనిపుణులు, హెచ్‌పిబి సర్జరీ డైరెక్టర్ డాక్టర్ ఎం.శ్రీనివాస్‌రెడ్డి నేతృత్వంలో, డాక్టర్ రజనీకాత్, డాక్టర్ సెల్వకుమార్ మల్లీశ్వరన్, హెపటాలజీ-ట్రాన్స్‌ప్లాంట్ డైరెక్టర్ డాక్టర్ జాయ్‌వర్గీస్ బృందం ఈ కాలేయమార్పిడి శస్త్రచికిత్సను విజయవంతంగా నిర్వహించడంతో రోగి కాలేయం ఇప్పుడు బాగా పని చేస్తూ ప్రాణాపాయం నుంచి బయటపడ్డాడని ఆసుపత్రి వైద్యులు తెలిపారు. రోగి తన శరీరంలోని అదనపు నీటిని కూడా కోల్పోయి, డిశ్చార్జ్ అయ్యే సమయానికి 130 కిలోలకు తగ్గాడని, ఈ శస్త్రచికిత్సతో రోగి బాగా కోలుకున్నాడని తెలిపారు. ఎట్టకేలకు శస్త్రచికిత్స సఫలీకృతం కావడం, రోగి ఆరోగ్యం కుదుటపడడం పట్ల ఆసుపత్రి వైద్యులు, రోగి కుటుంబసభ్యులు సంతోషం వ్యక్తం చేశారు.

# శ్రీసిటీకి రండి... మీ ప్రోత్సాహమందించండి

## రాష్ట్ర ఉన్నతాధికారులతో ఎం.డి రవీంద్ర సన్నారెడ్డి సమావేశాలు



శ్రీసిటీ మేనేజింగ్ డైరెక్టర్ డా. రవీంద్ర సన్నారెడ్డి ఇటీవల రాష్ట్ర ప్రభుత్వ ముఖ్య కార్యదర్శి డాక్టర్ కె.ఎస్.జవహర్‌రెడ్డి, డీజీపీ కె.వి.రాజేంద్రనాథ్‌రెడ్డిని వారి కార్యాలయాలలో కలుసుకుని, శ్రీసిటీని సందర్శించాలని వారిని ఆహ్వానించారు. శ్రీసిటీ పరిసర ప్రాంతాలలో అభివృద్ధికి, మరియు శాంతిభద్రతలను బలోపేతం చేయడానికి ప్రభుత్వం అందిస్తున్న సహకారానికి వారికి ధన్యవాదాలు తెలిపారు. డైనమిక్ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి నాయకత్వంలో రాష్ట్రాన్ని పెట్టుబడులకు అత్యంత ఆకర్షణీయంగా మార్చాలనే ప్రభుత్వ సంకల్పాన్ని ఆయన ప్రశంసించారు. చీఫ్ సెక్రటరీ మరియు డిజిపి ఇద్దరూ వివిధ హోదాలలో గతంలో శ్రీసిటీకి విచ్చేసిన సందర్భాలను గుర్తు చేసుకుంటూ, వెనుకబడిన ప్రాంతాన్ని మోడల్ ఇండస్ట్రియల్ పార్కుగా మార్చేందుకు కృషి చేశారంటూ శ్రీసిటీ ఎం.డి డా.రవీంద్ర సన్నారెడ్డిని వారు కొనియాడారు. ఆర్థిక శాఖ ముఖ్యకార్యదర్శి రావత్, రోడ్లు భవనాలు శాఖ ముఖ్యకార్యదర్శి పిఎస్ పృద్యుమ్న, ఇంధన శాఖ ముఖ్యకార్యదర్శి విజయానంద్, ట్రాన్స్‌కో జాయింట్ ఎం.డీ చంద్రశేఖర్‌బాబు, పొల్యూషన్ కంట్రోల్ బోర్డు కార్యదర్శి సభ్యులు శ్రీధర్, పరిశ్రమల డైరెక్టర్ మరియు ఏపిపిఐఐసి ఎం.డీ ప్రవీణ్‌కుమార్‌లతో డా.రవీంద్ర సన్నారెడ్డి సమావేశమయ్యారు.






# సంస్మరణ



కీ॥శే॥ కోర్శపాటి గోపాలరెడ్డి గారు
నిర్యాణం : 06.05.2012

కీ॥శే॥ కోర్శపాటి సీతమ్మ గారు
నిర్యాణం : 20.05.2020

మా ఇంటి దీపాలు, మా కంటి వెలుగులు
ఆదర్శ దంపతులు

**కీ॥శే॥ కోర్శపాటి గోపాలరెడ్డి**
**కీ॥శే॥ కోర్శపాటి సీతమ్మ గారలను**
సంస్మరించుకుంటూ...

కుమారుడు:
**కోర్శపాటి శ్రీధర్‌రెడ్డి, USA**
కోడలు:
**కోర్శపాటి శైలజ**

కుమార్తెలు - అల్లుళ్ళు
**మోసూరు హైమావతి - మోసూరు షణ్ముగంరెడ్డి**
**ఇసనాక శ్యామల - ఇసనాక జనార్ధన్‌రెడ్డి, USA**
**చేవూరు జ్ఞానప్రసూన - చేవూరు కృష్ణారెడ్డి**

మరియు **మనుమలు, మనుమరాళ్ళు, ముదిమనుమడు**

# శ్రీసిటీ పారిశ్రామిక ప్రగతి అద్భుతం

## కొనియాడిన పుదుచ్చేరి పరిశ్రమల శాఖ కార్యదర్శి జవహర్




ప్రపంచ ప్రఖ్యాతిచెందిన శ్రీసిటీ పారిశ్రామిక ప్రగతి, దాని ప్రణాళిక-అమలు చేసే విధానాలన్నీ అత్యద్భుతమని పుదుచ్చేరి రాష్ట్ర పరిశ్రమలు, వాణిజ్య శాఖ కార్యదర్శి మరియు కమిషనర్ పి.జవహర్ కొనియాడారు.

ఈనెల 15న ఆయన ఇతర సీనియర్ అధికారుల బృందంతో కలసి శ్రీసిటీని సందర్శించారు. ఈ సందర్భంగా, శ్రీసిటీ మేనేజింగ్ డైరెక్టర్ డాక్టర్ రవీంద్ర సన్నారెడ్డి వారికి సాదర స్వాగతం పలికి, శ్రీసిటీ ప్రగతి, ప్రత్యేకతలు, ప్రపంచస్థాయి మౌళిక సదుపాయాలు, పెట్టుబడిదారుల అనుకూల పర్యావరణ వ్యవస్థ, రాష్ట్ర ప్రభుత్వ ఆర్థిక ప్రోత్సాహకాల గురించి వివరించారు. శ్రీసిటీ రూపకల్పన, అమలు తీరును నేరుగా వీక్షించడం, అర్థం చేసుకోవడంతో పాటు తమ రాష్ట్రంలో ఈ నమూనాను అనుసరించే ఆలోచనతో సాధ్యాసాధ్యాలను అధ్యయనం చేయడమే పుదుచ్చేరి అధికారుల పర్యటన ముఖ్య ఉద్దేశ్యమని జవహర్ తెలిపారు. దేశంలో వేగంగా వృద్ధి చెందుతున్న సమీకృత వ్యాపార నగరాలకు సంబంధించి శ్రీసిటీ మంచి ఉదాహరణగా ఆయన కితాబిచ్చారు. శ్రీసిటీ భూసేకరణ ప్రక్రియ, భూమి అభివృద్ధి, మౌళిక సదుపాయాల అభివృద్ధి, భూమి లీజింగ్ నమూనాలు, అభివృద్ధి సమయంలో ఎదుర్కొంటున్న సమస్యలు, నైపుణ్యాభివృద్ధి శిక్షణ చర్యలు ఇతర వివిధ అంశాలను ఆయన శ్రీసిటీ ఎం.డి రవీంద్ర సన్నారెడ్డి నుంచి తెలుసుకున్నారు. అనంతరం శ్రీసిటీలో పర్యటించి మౌళిక వసతులను పరిశీలించారు. వాణిజ్యం, పరిశ్రమలు, విద్య, ఓడరేవులు, హౌసింగ్ తదితర విభిన్న రంగాలలో అపారమైన అనుభవం ఉన్న పుదుచ్చేరి ఉన్నతాధికారులలో ఒకరైన జవహర్ శ్రీసిటీని సందర్శించడం తామెంతో గౌరవంగా భావిస్తున్నామని రవీంద్ర సన్నారెడ్డి చెప్పారు. వారి అభిప్రాయాలు, సూచనలు శ్రీసిటీ అభివృద్ధికి మరింత ప్రోత్సాహకరంగా ఉంటాయన్నారు. శ్రీసిటీ ప్రారంభ దశలో ఎదుర్కొన్న కొన్ని సవాళ్లు, పరిష్కారాల గురించి ప్రస్తావిస్తూ, ఇతర రాష్ట్రాలకు చెందిన పలువురు ఉన్నతాధికారులు తమ ప్రాజెక్ట్ మోడల్‌ను ప్రస్తావించడం, అధ్యయనం చేయడం విశేషమని పేర్కొన్నారు. ఈ పర్యటనలో పుదుచ్చేరి రాష్ట్ర పరిశ్రమలు, వాణిజ్య శాఖ డైరెక్టర్, ఐపిడిఐసి ఎం.డి రుద్రగౌడ్, జనరల్ మేనేజర్ సురేష్ రాజ్, పరిశ్రమలు, వాణిజ్య శాఖ అసిస్టెంట్ డైరెక్టర్ ధన్ గోవింద్, డిఐసి డెప్యూటీ ఫంక్షనల్ మేనేజర్ జయరామన్, డెప్యూటీ మేనేజర్(వర్క్స్) శంకరన్, పుదుచ్చేరి ఉమెన్స్ ఇంజనీరింగ్ కళాశాల ఫ్యాకల్టీ డాక్టర్ గాంధీమోహన్, ఇడిపి మేనేజర్ ఆర్.బాల తదితరులు పాల్గొన్నారు.

# కావలి డీఎస్పీ తీరుపై నిరసన

కావలిలో ఇటీవల జరిగిన ముఖ్యమంత్రి పర్యటనలో కావలి బిజెపి నాయకుడు మొగరాల సురేష్ పట్ల అనుచితంగా ప్రవర్తించిన కావలి డిఎస్పీని సస్పెండ్ చేయాలంటూ బిజెపి నాయకులు, బీసీ సంఘాల వారు ఈనెల 15న నెల్లూరులో పెద్దఎత్తున నిరసన ప్రదర్శన చేపట్టారు. పోలీసులు వైకాపా నాయకులుగా ప్రవర్తిస్తున్నారంటూ ప్రదర్శకులు దుయ్యబడుతూ నినాదాలు చేశారు. ప్రభుత్వం, పోలీసులు నిరంకుశంగా వ్యవహరిస్తున్నారని వారు ఆందోళన వ్యక్తం చేస్తూ రోడ్డుపై బైఠాయించారు. ఈ సందర్భంగా పోలీసులకు, నాయకులకు మధ్య వాగ్వివాదాలు, తోపులాటలు జరిగి పరిస్థితి ఉద్రిక్తంగా మారింది. అనంతరం ర్యాలీగా వెళ్ళి కలెక్టర్ హరినారాయణన్‌కు వారు వినతిపత్రం సమర్పించారు. ఈ ఆందోళనలో బిజెపి నాయకులు సన్నపురెడ్డి సురేష్‌రెడ్డి, కర్నాటి ఆంజనేయరెడ్డి, భరత్‌కుమార్‌యాదవ్, మిడతల రమేష్, ఫణిరాజు, పెంచలయ్య, రఘునాథరాజు తదితరులు పాల్గొన్నారు.

# నెల్లూరుపాళెంలో అగ్నిప్రమాదం

మండే ఎండల తీవ్రతకు ఆత్మకూరు మండలం నెల్లూరుపాళెంలో ఉన్న మూడు పొగాకు బ్యారెన్లు అగ్నిప్రమాదానికి గురయ్యాయి. ఈ బ్యారెన్లు దగ్ధమైన ప్రాంతాన్ని ఈనెల 16న ఆత్మకూరు మునిసిపల్ కమిషనర్ నాగేశ్వరరావు పరిశీలించారు. రైతులతో మాట్లాడారు. ఈ మండేఎండల్లో ప్రజలు జాగ్రత్తగా ఉండాలని, ప్రమాదాలు జరగకుండా చూసుకోవాలని సూచించారు.

# జలదంకిలో గడ్డివామి దగ్ధం

మండలకేంద్రమైన జలదంకిలో ఉత్సవాల సందర్భంగా బాణసంచా పేల్చడంతో ఆ నిప్పురవ్వలు పడి, రైతు వేణుగోపాలరెడ్డికి చెందిన 11 ఎకరాల గడ్డివామి అగ్నికి ఆహుతైపోయింది. దీంతో సుమారు 2 లక్షల రూపాయల విలువచేసే గడ్డి మంటల్లో మాడి మసైపోయిందని బాధితుడు వాపోయాడు. వింజమూరు అగ్నిమాపకదళం వారు వచ్చి మంటలు ఆర్పారు.

తిరుపతి జిల్లా గూడూరు డివిజన్

## రోటరీ క్లబ్, నెల్‌క్యాస్ట్ ఆధ్వర్యంలో

# మోక్షధామం అభివృద్ధి



పడమర గూడూరులో ఉన్న శ్మశానం అభివృద్ధిలో భాగంగా ఈ నెల 15వ తేదీ రోటరీ క్లబ్, నెల్‌క్యాస్ ఆధ్వర్యంలో మోక్షధామం అభివృద్ధికి నెల్‌క్యాస్ట్ యాజమాన్యం సీఎస్ఆర్ ఫండ్ క్రింద 2 లక్షలు వెచ్చించి శ్మశానం చుట్టూ ఫెన్సింగ్, గ్రీన్‌బెల్ట్, పరిశుభ్రం చేసి అభివృద్ధి చేశారు. ప్రాస్పరో స్కూల్ కరస్పాండెంట్, రొటేరియన్ దశరథరామిరెడ్డి 4 బెంచీలు, పి.వి.కృష్ణయ్య 4 బెంచీలు శ్మశానానికి వచ్చే వారి సౌకర్యార్థం ఏర్పాటు చేశారు. ముందుగా నెల్‌క్యాస్ట్ కంపెనీ కార్పొరేట్ హెచ్ఆర్, అడ్మిన్ ఎన్.సుదర్శనరెడ్డి, ప్లాంట్ హెడ్ వెంకటేశన్ మరియు రోటరీ క్లబ్ వారు శిలాఫలకాన్ని ప్రారంభించారు. ఈ శ్మశానంలో క్యాటిల్‌ట్రాప్ తదితర అభివృద్ధి కార్యక్రమాలు చేశారు. రోటరీ అధ్యక్షులు కిరణ్‌చక్రవర్తి, దశరథరామయ్య, మయూరి శ్యాంయాదవ్, పి.వి.కృష్ణయ్య, రాంప్రసాద్, కె.జనార్ధన్‌రెడ్డి, రఘురామిరెడ్డి, పి.వి.రత్నయ్య, జీజీ నాయుడు, నెల్‌క్యాస్ట్ ప్రతినిధులు ఎన్.ఎస్.రెడ్డి, డి.రవీంద్రనాథ్‌రెడ్డి, కంపెనీ పిఆర్ఓ ఆనిమెళ్ళ శివకుమార్ పాల్గొన్నారు.

# జాతీయ స్థాయి సాంఘిక నాటక పోటీలు



డిఎన్ఆర్ కమ్యూనిటీ హాల్‌లో 70వ జాతీయ స్థాయి సాంఘిక నాటిక పోటీలు ఉత్సాహంగా ముగిశాయి. ఈ నెల 16వ తేదీ శ్రీకాకుళం జిల్లా బూరివంక శర్వాణీ గ్రామీణ గిరిజన సాంస్కృతిక సేవా సంఘం ప్రదర్శించిన కొత్త పరిమళం నాటిక ఆకట్టుకుంది. హైదరాబాద్ సిరిమువ్వ కల్చరల్స్ ఆధ్వర్యంలో ప్రదర్శించిన 'థింక్' నాటిక ప్రేక్షకులను మెప్పించింది. 17వ తేదీన బహుమతి ప్రదానోత్సవానికి ప్రముఖ సినీ హీరో బానుచందర్ హాజరయ్యారు. సిద్ధారెడ్డి జనార్ధన్‌రెడ్డి, కె.మునిగిరీష్, ఆనిమెళ్ళ శివకుమార్, కట్టా మురళీకృష్ణ, జనార్ధన్ తదితరులు పాల్గొన్నారు.

# హనుమాన్ జయంతి వేడుకలు



గూడూరు మాలవ్యానగర్‌లోని శ్రీ శ్రీరామరక్షా కుటీరం (కీ॥శే॥ శ్రీరామరక్షా పున్నారావు దంపతుల స్వగృహం) ఆధ్వర్యంలో 53వ శ్రీ హనుమజ్జయంతి ఉత్సవాలు ఈ నెల 13, 14, 15తేదీలలో ఘనంగా జరిగాయి. 13వ తేదీ అంకురారోహణ, కలశస్థాపన, గోపూజతో మొదలై 15వ తేదీ శ్రీ సువర్చలాంజనేయ కళ్యాణం తదుపరి పూర్ణాహుతి, కలశోద్వాసన పూజలు జరిగాయి. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని తీర్థప్రసాదాలు స్వీకరించి, అన్నదానం కార్యక్రమంలో పాల్గొన్నారు. శ్రీరామరక్ష సేవాసంఘం ప్రతినిధులు చిట్టిబాబు, పవన్, గురుగుహ పాల్గొన్నారు.

# వైద్యసిబ్బంది సేవలు అభినందనీయం



రోగులకు సేవలు చేయడంలో నర్సులు, వైద్య సిబ్బంది పనితీరు అభినందనీయమని శ్రీ కృష్ణ సేవాసమితి వ్యవస్థాపక అధ్యక్షులు, దక్షణ మధ్య రైల్వే డివిజన్ డిఆర్‌యూసిసి సభ్యుడు డాక్టర్ బి.శ్యామ్‌యాదవ్ తెలిపారు. అంతర్జాతీయ నర్సుల దినోత్సవం సందర్భంగా గూడూరు పట్టణంలో ప్రాంతీయ వైద్యశాలలో శ్రీకృష్ణ సేవాసమితి ఆధ్వర్యంలో ప్రభుత్వ ఆసుపత్రి నర్సులను, సూపరింటెండెంట్ షరీనా, ఆర్ఎంవో సందీప్, శ్రీనివాసులను ఘనంగా సన్మానించారు. డాక్టర్ చంద్రహాస్, నర్సింగ్ సూపరింటెండెంట్ విజయ, హెడ్ నర్సులు విజయలక్ష్మి, వజ్రమ్మ తదితరులు పాల్గొన్నారు.



# రాజీమార్గమే రాజమార్గం

## ఏడో అదనపు జిల్లా జడ్జి షమ్మీ పర్వీన్

క్షణికావేశంలో చేసే తప్పులతో జీవితంలో ఇబ్బందులు పడడమే కాకుండా, కుటుంబసభ్యులకు దూరంగా జీవించాల్సిన పరిస్థితి ఏర్పడుతుందని ఏడో అదనపు జిల్లా జడ్జి షమ్మీ పర్వీన్ సుల్తానా బేగం అన్నారు. ఈ నెల 13న గూడూరులో మెగా జాతీయ లోక్‌అదాలత్ నిర్వహించి కేసులు పరిష్కరించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ కోర్టుల చుట్టూ తిరిగి సమయం వృధా చేసుకోవడం కంటే లోక్‌అదాలత్‌లో రాజీ మార్గమే రాజమార్గమని పేర్కొన్నారు. న్యాయవాదులు, కోర్టు సిబ్బంది, పోలీసులు పాల్గొన్నారు.

# రోటరీ వెస్ట్ క్లబ్ మజ్జిగ చలివేంద్రం




ప్రస్తుతం ఎండలు ఎక్కువవుతున్న దృష్ట్యా గూడూరు ప్రభుత్వ ఆసుపత్రిలో చికిత్స పొందటానికి వచ్చిన రోగుల కోసం గూడూరు రోటరీ క్లబ్ వెస్ట్ ఆధ్వర్యంలో ఈ నెల 16న మజ్జిగ చలివేంద్రాన్ని ఏర్పాటు చేశారు. క్లబ్ అధ్యక్షులు బండి ధనుంజయరెడ్డి మాట్లాడుతూ ఎండల దృష్ట్యా చలివేంద్రం ఏర్పాటు చేశామని, అలాగే ఎండలకు ప్రజలు అవసరమైతే తప్ప బయటకు రాకుండా తగు జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. ఆసుపత్రి సూపరింటెండెంట్ షారీనా, రొటేరియన్ మయూరి శ్యామ్‌యాదవ్, శ్రీకంటి రామ్మోహన్‌రావు, సిద్ధారెడ్డి హరి, హరినాథ్‌రెడ్డి, సుబ్రహ్మణ్యం, బలరామరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# సెబ్ వాహనం బోల్తా..

## అధికారులు, సిబ్బందికి గాయాలు

- పరామర్శించిన జిల్లా ఎస్పీ



పొదలకూరు మండలం తాటిపర్తి వద్ద వేగంగా వెళ్తున్న సెబ్ అధికారుల వాహనం అదుపు తప్పి బోల్తా కొట్టడంతో, వాహనంలో ఉన్న సెబ్ అధికారులు గాయాలపాలయ్యారు. ఈ ప్రమాదం ఈనెల 16న జరిగింది. స్థానికులు గమనించి బాధితులను నెల్లూరులోని ఆసుపత్రికి తరలించారు. ఇసుకరీచ్ వద్ద నుంచి ఇసుకను అక్రమంగా తరలి స్తున్నారన్న సమాచారంతో తనిఖీల కోసం వాహనంలో వెళ్తున్న సెబ్ అధికారులు ప్రమాదవశాత్తూ గాయపడిన విషయం తెలుసుకుని జిల్లాఎస్పీ తిరుమలేశ్వరరెడ్డి, ఏఎస్పీ హిమవతి హుటాహుటిన నెల్లూరులోని అపోలో ఆసుపత్రిలో చికిత్సపొందుతున్న ఆ అధికారులను పరామర్శించారు.

ప్రమాద ఘటనలో డ్రైవర్ వాసు, కానిస్టేబుళ్ళు విజయ్, హరి తీవ్రంగా గాయపడ్డారు. సెబ్ ఇన్స్పెక్టర్ హుస్సేన్‌బాషా, ఎస్ఐ బాలకృష్ణ, కానిస్టేబుళ్లు తిరుపతి, జగదీష్‌లకు స్వల్ప గాయాలయ్యాయి. బాధితులను పరామర్శించి వారి కుటుంబ సభ్యులకు ఎస్పీ ధైర్యం చెప్పారు. బాధితులకు మెరుగైన వైద్యం అందించాలని ఆసుపత్రి నిర్వాహకులను కోరారు.

# టెన్త్‌లో మౌలిక ప్రతిభ



ఇటీవల పదవ తరగతి పరీక్షల్లో 572 మార్కులు సాధించి మండల స్థాయిలో ప్రథమస్థానంలో నిలిచిన జడ్పీ హైస్కూల్‌కు చెందిన విద్యార్థిని ఆలపాక మౌలికను ఇటీవల పాఠశాల ఉపాధ్యాయులు సన్మానించి అభినందించారు. పేద విద్యార్థిని అయినప్పటికీ పట్టుదలతో మౌలిక చదువుల్లో బాగా రాణించడం సంతోషకరమని వారు, భవిష్యత్తులో మరింత మంచిస్థాయికి చేరుకోవాలని వారు ఆకాంక్షించారు. పాఠశాల ప్రధానోపాధ్యాయులు వెంచురామయ్య తదితరులు పాల్గొన్నారు.

### శత వసంతాల

# వెంకురెడ్డి..కన్నుమూత

## మాజీ ఎమ్మెల్యే పోలంరెడ్డికి పితృవియోగం



కోవూరు మాజీ ఎమ్మెల్యే పోలంరెడ్డి శ్రీనివాసులురెడ్డి తండ్రి పోలంరెడ్డి వెంకురెడ్డి మే 16 మంగళవారం నాడు బెంగుళూరులో వయోభారంతో కన్నుమూశారు. ఆయన వయసు నూరు సంవత్సరాలు. ఇటీవల ఆయన శతవసంతాలు కూడా సమీపంలోని నార్త్‌రాజుపాలెం గ్రామంలో ఘనంగా జరిగాయి. ఆయనకు నలుగురు కుమారులు, ముగ్గురు కుమార్తెలు ఉన్నారు. మొదటి కుమారుడు పోలంరెడ్డి శ్రీనివాసులురెడ్డి మాజీ ఎమ్మెల్యే, మనుమడు పోలంరెడ్డి దినేష్‌రెడ్డి టిడిపి నియోజకవర్గ ఇన్‌చార్జిగా ఉన్నారు. మిగిలినవాళ్ళు హైదరాబాద్, బెంగుళూరు ప్రాంతాల్లో స్థిరపడ్డారు. బెంగుళూరులో ఉన్న కుమారుడు శ్రీధర్‌రెడ్డి నివాసంలో ఆయన మృతిచెందారు. ఆయన మృతికి స్థానిక ప్రముఖులు నివాళులర్పించారు. బుధవారం కోవూరు సమీపంలోని నార్త్‌రాజుపాలెంలో వెంకురెడ్డి మృతదేహానికి అంత్యక్రియలు జరిగాయి.

### రెండేళ్ళుగా జీతాలివ్వకుంటే..

# లస్కర్లు ఎలా బతకాలి?

**- మాజీమంత్రి సోమిరెడ్డి ఆందోళన**



నీటిపారుదల శాఖలో పని చేస్తున్న కిందిస్థాయి ఉద్యోగులైన లస్కర్లకు గత రెండేళ్లుగా జీతాలివ్వకుండా వారి జీవితాలతో ఆడుకుంటోందని, జీతాలు లేకుండా లస్కర్లు ఎలా బతకాలని మాజీమంత్రి, టిడిపి పొలిట్ బ్యూరో సభ్యులు సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి ప్రశ్నించారు. ఇటీవల ఆయన నెల్లూరులోని నీటిపారుదలశాఖ కార్యాలయ ఆవరణంలో జీతాల కోసం నిరసన చేపట్టిన లస్కర్ల ఆందోళనకు మద్దతుగా సంఘీభావం ప్రకటించారు. ఈ సందర్భంగా సోమిరెడ్డి మాట్లాడుతూ, నెల తిరిగేసరికి లక్షల రూపాయల జీతాలు తీసుకుంటున్న అధికారులు, కనీసం మానవత్వం కూడా లేకుండా, కష్టపడి పనిచేసే చిరుద్యోగులైన లస్కర్లకు దాదాపు 22 నెలలుగా జీతాలు ఇవ్వకుండా కాలయాపన చేస్తుండడం బాధాకరమని అన్నారు. ఉద్యోగులకు సక్రమంగా జీతాలివ్వలేని ప్రభుత్వం ఏం ప్రభుత్వమని అంటూ, వైకాపా నాయకులు మాత్రం ఈ శాఖలో ఒకేబిల్లుకు అనేకసార్లు డబ్బులు దండుకుంటున్నారని, జిల్లాకు చెందిన వ్యవసాయశాఖ మంత్రి కాకాణి చిరుద్యోగుల సమస్యలు పట్టించుకోకపోవడం దారుణమని అన్నారు. అసలు వ్యవసాయశాఖకు ప్రభుత్వం ఎంత ఖర్చుచేస్తోందో శ్వేతపత్రం విడుదల చేయాలని ఆయన డిమాండ్ చేశారు. వైకాపా ప్రభుత్వం అధికారంలోకి వచ్చినప్పటినుంచి రాష్ట్రంలో ఆర్థిక పరిస్థితులు కుదేలైపోయాయని, చివరకు ఉద్యోగులకు జీతాలు కూడా ఇవ్వలేని దయనీయస్థితి దాపురించిందని ఆందోళన వ్యక్తం చేశారు. టిడిపి నాయకులు చేజర్ల వెంకటేశ్వర్లురెడ్డి, బొమ్మి సురేంద్ర, రాధాకృష్ణమనాయుడు, సిఐటియు జిల్లా నాయకులు అజయ్‌కుమార్, కార్యదర్శి నాగేశ్వరరావు, అఖిలక్ష రైతు సంఘం నాయకుడు గంగపట్నం రమణయ్య తదితరులు పాల్గొన్నారు.

# డెంగ్యూతో జాగ్రత్త

## మలేరియా అధికారి డాక్టర్ బ్రిజిత

డెంగ్యూ వ్యాధిపట్ల ప్రతిఒక్కరూ అప్రమత్తంగా ఉండాలని, రోగులు ప్రాథమిక దశలోనే చికిత్స చేయించుకుని ఆ ప్రాణాంతక వ్యాధి నుంచి బయటపడాలని జిల్లా మలేరియా వ్యాధి నివారణాధికారి డాక్టర్ బ్రిజిత పేర్కొన్నారు. జాతీయ డెంగ్యూ నివారణ దినోత్సవం సందర్భంగా ఈనెల 15న ఆమె మాట్లాడుతూ, జిల్లాలో డెంగ్యూ కేసులు పెరుగుతున్నాయని, తగిన జాగ్రత్తలు పాటిస్తే ఆ వ్యాధిని అరికట్టవచ్చన్నారు. దోమల వల్ల డెంగ్యూ వ్యాధి వస్తుందని, ఇంటి లోపల బయట, ఖాళీ పీపాల్లోనూ, టైర్లు, టెంకాయ చిప్పల్లో నీరు నిల్వకుండా చూసుకోవాలని, దోమల లార్వాలకు ఆవాసం లేకుండా చేయడం ద్వారా దోమలను నివారించుకోవచ్చని సూచించారు. జ్వరం, విపరీతమైన తలనొప్పి ఉన్నట్లయితే అది డెంగ్యూవ్యాధిగా అనుమానించి ఆసుపత్రుల్లో వైద్యపరీక్షలు చేయించుకోవాలన్నారు.

### సిబిఎస్ఇ టెన్త్ ఫలితాల్లో..

# శ్రీసిటీ చిన్మయా విద్యాలయ విజయకేతనం

**వరుసగా ఆరవసారి వందశాతం ఉత్తీర్ణత**

ఇటీవల వెలువడిన సిబిఎస్ఇ పదవ తరగతి ఫలితాల్లో శ్రీసిటీ చిన్మయా విద్యాలయ సిబిఎస్ఇ పాఠశాల విద్యార్థులు వందశాతం ఉత్తీర్ణత సాధించి అందరి ప్రశంసలందుకున్నారు. ఈ పాఠశాల నుంచి 39 మంది విద్యార్థులు పది పరీక్షలకు హాజరు కాగా, అందరూ ఉత్తీర్ణులయ్యారని చిన్మయ విద్యాలయ ప్రిన్సిపాల్ కె.భువనేశ్వరి తెలిపారు. వారిలో 22 మంది డిస్టింక్షన్‌లోనూ, పదిమంది ఫస్ట్ క్లాస్, ఏడుగురు సెకండ్ క్లాస్‌లోనూ ఉత్తీర్ణత సాధించారన్నారు. వీరిలో వి.కేశవ్ 95.2 శాతం, ఎం.ఎం.సోహన్ కృష్ణ 94 శాతం, ఎన్.జి.దేవాజ్ ప్రభాకర్ 91.8శాతం, ఎం.చరణ్‌తేజ 91.6శాతం, ఎస్.పార్థసారథి గౌడ్ 90 శాతం మార్కులతో స్కూల్ టాపర్లుగా నిలిచారని ఆమె తెలిపారు. ఈ పాఠశాలకు సంబంధించి పదవ తరగతి పరీక్షలకు ఇది 6వ బ్యాచ్ కాగా, వరుసగా ఆరేళ్ళు వందశాతం ఫలితాలు సాధించడం విశేషం. మంచి ఫలితాలు సాధించినందుకు విద్యార్థులు, ప్రిన్సిపాల్, టీచర్లకు శ్రీసిటీ మేనేజింగ్ డైరెక్టర్ డాక్టర్ రవీంద్ర సన్నారెడ్డి అభినందనలు తెలిపారు.

# చెముడుగుంటలో బంగారు అపహరణ

వెంకటాచలం మండల పరిధిలోని చెముడుగుంటలో ఇటీవల దొంగలు ఓ ఇంటి తాళాలు పగులగొట్టి ఇంట్లో ఉన్న లక్షా యాభైవేల రూపాయలతో పాటు 25 సవర్ల బంగారు నగలు అపహరించుకుపోయారు. పోలీసులు కథనం మేరకు వివరాలిలా ఉన్నాయి. చెముడుగుంటకు చెందిన కాకి రమేష్, కుటుంబ సభ్యులు బయటకు వెళ్ళివుండగా పట్టపగలే దొంగలు ఇంటి వెనుక తలుపులకు వేసివున్న తాళాలు పగులగొట్టి దొరికినంత సొత్తును దోచుకుపోయారు. రమేష్ ఇంటికి వచ్చి చూసుకునేసరికి దొంగతనం జరిగిపోయింది. పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

## టూకీగా...



### వేదగిరీశునికి పెరిగిన హుండీ ఆదాయం

నెల్లూరు రూరల్ మండలంలోని శ్రీ వేదగిరి లక్ష్మీనరసింహస్వామి దేవాలయంలో ఇటీవల వార్షిక బ్రహ్మోత్సవాల సందర్భంగా హుండీలను లెక్కించగా, మే 5 ఉంచి 10వ తేది వరకు భక్తులు సమర్పించిన కానుకల ద్వారా ఆలయానికి 7,74,154 రూపాయల ఆదాయం వచ్చినట్లు ఆలయ వర్గాలు తెలిపాయి. గత ఏడాది కంటే ఈసారి భక్తులు బ్రహ్మోత్సవాలకు అధికసంఖ్యలో వచ్చారని, గతేడాది కంటే 1,44,026 రూపాయలు అదనంగా ఆదాయం వచ్చిందని పేర్కొన్నారు.

### రాపూరులో 'నాడు-నేడు' పనుల పరిశీలన

మండలకేంద్రమైన రాపూరు పాఠశాలలో జరుగుతున్న నాడు-నేడు పనులను ఈనెల 16న జిల్లా విద్యాశాఖ అధికారి గంగాభవాని పరిశీలించారు. సకాలంలో పనులు పూర్తిచేయాలని, పనులు నాణ్యతగా ఉండాలని ఆమె సంబంధిత అధికారులకు సూచించారు. మండల విద్యాశాఖ అధికారి శ్రీనివాసులు తదితరులు ఆమె వెంట ఉన్నారు.

### కందమూరులో మంచినీటి చలివేంద్రం

ఎండల తీవ్రత దృష్ట్యా పాదాచారుల దాహార్తిని తీర్చేందుకు నెల్లూరు రూరల్ మండలంలోని కందమూరు గ్రామంలో సచివాలయం పరిధిలో అధికారులు మంచినీటి చలివేంద్రను ఏర్పాటుచేశారు. కలెక్టర్ ఆదేశాల మేరకు రూరల్ ఎండిఓ ఈ నెల 16న చలివేంద్రాన్ని ప్రారంభించారు. పంచాయతి కార్యదర్శి షేక్ ముషీదర్, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

### 6 మంది బాలకార్మికులకు విముక్తి

బాలకార్మిక వ్యవస్థ నిర్మూలన కమిటీ ఆధ్వర్యంలో ఇటీవల జిల్లాలో పలుచోట్ల తనిఖీలు నిర్వహించి 16 మంది బాల కార్మికులకు విముక్తి కలిగించారు. ఆ బాలల తల్లితండ్రులకు కౌన్సిలింగ్ ఇచ్చి, పిల్లలను చదివించుకోవాలన్నారు. బాలలచేత పనిచేయించుకుంటున్న యజమానులపై చర్యలు తీసుకుంటున్నట్లు ఉప కార్మిక కమిషనర్ ఎం.వెంకటేశ్వర్రావు తెలిపారు.

### డిసి పల్లిలో దొంగల భయం

మర్రిపాడు మండలంలోని డిసి పల్లి దొంగలభయంతో హడలిపోతోంది. ఇటీవల ఒకటి రెండురోజుల్లోనే 8 ఇళ్ళల్లో దొంగలు చోరీలకు పాల్పడడంతో ప్రజలు భయాందోళన చెందుతున్నారు. మర్రిపాడు బస్టాండ్ సెంటర్లో ఉన్న కూరగాయల అంగళ్ళలోనూ దొంగలు చోరీయత్నాలకు పాల్పడ్డారు. దొంగతనాల నివారణకు పోలీసులు చర్యలు తీసుకోవాల్సి ఉంది.

### లింగగుంటలో అక్రమ ఇసుక ట్రాక్టర్ల పట్టివేత

అనంతసాగరం మండలంలోని లింగగుంటలో పెన్నా పరివాహక ప్రాంతం నుంచి అక్రమంగా ఇసుక తరలించుకు పోతున్న రెండు ట్రాక్టర్లను ఇటీవల సెబ్ అధికారులు పట్టుకున్నారు. వాటిని పోలీస్‌స్టేషన్‌కు తరలించి, యజమానులకు జరిమానా విధించారు.

### తిరుమలాపురం సచివాలయం తనిఖీ

ఉదయగిరి మండలంలోని తిరుమలాపురం సచివాలయాన్ని ఈనెల 16న ఉదయగిరి ఎంపిడిఓ ఐజాక్ ప్రవీణ్ ఆకస్మికంగా తనిఖీ చేశారు. రికార్డులు పరిశీలించారు. బయోమెట్రిక్ హాజరు వెయ్యాలని, ఆయుష్మాన్ సర్వేని వలంటీర్లు శ్రద్ధగా నిర్వహించాలని, విధుల పట్ల అలక్ష్యం వద్దని సంబంధిత ఉద్యోగులకు, సిబ్బందికి సూచించారు.

### కావలిలో హనుమాన్ జయంతి

హనుమత్ జయంతిని పురస్కరించుకుని, కావలిలోని ఒంగోలు బస్టాండ్ వద్ద ఉన్న శ్రీ అభయాంజనేయస్వామి దేవాలయంలో పూజలు నిర్వహించారు. ఈనెల16న స్వామివారికి కన్నులపండువగా పుష్పయాగం చేశారు.

### కలిగిరిలో విద్యార్థులకు బహుమతులు

కలిగిరి మండలంలో పదోతరగతి పరీక్షల్లో ఉత్తమ మార్కులు సాధించిన 20 మంది విద్యార్థులకు ఈనెల 16న జడ్పీటీసీ పాలూరు మల్యాద్రిరెడ్డి బహుమతులందజేశారు. కలిగిరి ఉప సర్పంచ్, దాత పాలూరు కొండారెడ్డి సహకారంతో ఈ కార్యక్రమం జరిగింది.

# పొత్తుల పాట - మౌన బాట

(మొదటి పేజీ తరువాయి)

నుంచి కృష్ణా వరకు 25శాతం ఓటు బ్యాంకు ఉందని, తమకు బలం ఉన్న ప్రాంతాల్లో 30 శాతం ఓట్లున్నాయని ఆయన చెప్తున్నాడు. రాష్ట్రంలో వైసీపీ వ్యతిరేక ఓటు కేవలం జనసేనకు మాత్రమే బదిలీ అవుతుందనుకుంటే సరిపోదు. ఖచ్చితంగా ప్రధాన ప్రత్యర్థి టీడీపీకి కూడా బదిలీ అవుతుంది. వైసీపీ, టీడీపీ రాష్ట్రంలో రెండు ప్రధాన పార్టీలు. ఈ రెండు పార్టీలతో విసిగిపోయిన ఓటర్లనైనా ఆకర్షించగలిగేలా క్షేత్రస్థాయిలో కార్యాచరణ ఉండాలి. కాబట్టి బూత్‌ల వారీగా కార్యకర్తలను ఏర్పాటు చేసుకుని జనంలో తమ పార్టీని పటిష్టం చేసుకోవాలి. అవేమీ లేకుండా "రాష్ట్రవ్యాప్తంగా మనకు బలం లేదు. సీఎం సీటు అడిగితే ఇవ్వరు కాబట్టి టీడీపీ, బీజేపీతో కలిసి వైసీపీని ఓడిద్దాం" అంటూ ప్రసంగించడం వలన ఆయనకు నష్టమే తప్ప లాభం ఉండదు. కర్ణాటకలో జేడీఎస్ తరహాలో 30, 40 సీట్లు చేతిలో ఉంటే కింగ్ మేకరై సీఎం పోస్టు అడగొచ్చనే అర్థంవచ్చేలా పవన్ మాట్లాడుతున్నాడు. కుమారస్వామి ఈ తరహాలోనే రెండుసార్లు ముఖ్యమంత్రి అయ్యాడు. కర్ణాటకలో గత ఎన్నికల్లో కుమారస్వామి గెలుచుకున్న 37 స్థానాలు సొంత బలంతో, ఎవరితోనూ పొత్తు లేకుండా గెలిచాడు. అందుకే కింగ్‌మేకరై సీఎం పోస్టు సాధించాడు. 80 స్థానాలు సాధించిన కాంగ్రెస్ ఉపముఖ్యమంత్రి పదవితో సరిపెట్టుకోవలసి వచ్చింది. కుమారస్వామి ఒక మాజీ ప్రధానమంత్రి కొడుకు. అంతేకాదు, కర్ణాటకలో బలమైన సామాజిక వర్గానికి నాయకుడు, రాజకీయంగా ఆరితేరిన కుటుంబం నుండి వచ్చిన వాడు. కానీ జనసేనాని పరిస్థితి అది కాదు, ఆయన కేవలం సినిమా గ్లామర్ తో వచ్చాడు, కాబట్టి టీడీపీతో పొత్తు పెట్టుకుని ఓట్ల బదిలీ జరిగితే తప్ప ఈ అంకె జనసేనకు వచ్చే పరిస్థితి కనపడడం లేదు.

## ప్రాంతీయ పార్టీలకు కమల గండం

కేంద్రంలో బీజేపీకి రెండు విడతలుగా సంపూర్ణ మెజార్టీ రావడంతో ఎన్డీఏ కూటమిలో ప్రాంతీయ పార్టీల సంఖ్య తగ్గుతూ వస్తోంది. పంజాబ్‌లో అకాలీ దళ్, మహారాష్ట్రలో శివసేన, తమిళనాడులో అన్నా డీఎంకే, బీహార్‌లో లోక్‌జనశక్తి, 2014లో టీడీపీ కూడా ఉండేది. ప్రస్తుతం ఎన్డీఏలో బీజేపీ తర్వాత ఉన్న పార్టీ ఏదీ అంటే శివసేన చీలిక గ్రూపు మాత్రమే. 12 మంది శివసేన ఎంపీలు విడిగా ఏర్పడి ఎన్డీఏలో భాగమయ్యారు. దాదాపుగా పాతికేళ్లపాటు బీజేపీకి నమ్మకమైన మిత్రపక్షంగా ఉన్న శివసేన ఇప్పుడు బీజేపీ ధాటికి కకావికలం అయిపోయింది. అకాలీదళ్‌దీ అదే పరిస్థితి. అన్నాడీఎంకే కూడా బీజేపీ రాజకీయ చందరంగంలో చిక్కుకుని విలవిల్లాడుతోంది. బీహార్‌లో రాంవిలాస్ పాశ్వాన్ చనిపోయాక ఆయన పార్టీ లోక్ జనశక్తి చిన్నాభిన్నమైంది. ఆయన కుమారుడిని బాబాయ్‌ని విడదీసి, బాబాయ్‌ను బీజేపీ అక్కున చేర్చుకుంది. ఇప్పుడు ఆ పార్టీ ఉనికే కష్టంగా మారింది. బీహార్‌లోని జేడీయూ పరిస్థితి కూడా అదే. బీజేపీ కుయుక్తులకు భయపడి ఆర్జేడీని పట్టుకుని నితీష్ ప్రభుత్వం ఏర్పాటు చేసుకున్నారు. ఇలా బీజేపీతో పొత్తు పెట్టుకున్న పార్టీలన్నీ నిర్వీర్యమైపోతున్నాయి. ఇందుకు టీడీపీ, జనసేన మినహాయింపేమీ కాదు. బీజేపీతో ఎప్పటికైనా గండమేనని భావించిన జనసేనాని వ్యూహాత్మకంగానే ఆ పార్టీని వదిలించుకునేందుకే ఇలా పొత్తులపై బహిరంగ ప్రకటనలకు పూనుకుని ఉంటారన్నది రాజకీయ వర్గాల అభిప్రాయం.

## టీడీపీ విజయాలన్నీ పొత్తులతోనే..

40 ఏళ్ల ప్రస్థానం పూర్తి చేసుకున్న తెలుగుదేశం పార్టీ పొత్తులతోనే ఎక్కువగా గెలిచింది. పొత్తులు లేకుండా ఒంటరిగా పోటీ చేసిన ఎన్నికల్లో ఆ పార్టీ ఓటమి మూటగట్టుకోవాల్సి వచ్చింది. టీడీపీ స్థాపించాక మొదటి ఎన్నికల్లో 294 సీట్లకు గాను 289 స్థానాల్లో పోటీ చేసింది. 46.03ఓట్ల శాతంతో 201 సీట్లు సాధించారు. మేనకా గాంధీ పార్టీ సంజయ్ విచార్‌మంచ్‌తో పొత్తుపెట్టుకుని వారికి 5 సీట్లు ఇచ్చారు. 4 సీట్లలో ఆ పార్టీ గెలిచింది. టీడీపీ కూటమికి 205 సీట్లు వచ్చాయి. పార్టీ స్థాపించిన 9 నెలల కాలంలోనే అఖండ విజయం సాధించడం సాధారణ విషయం కాదు. 1985 ఎన్నికల్లో వామ పక్షాలు, బీజేపీతో పొత్తు పెట్టుకుని గెలిచింది. 1989లో వామపక్షాలతో పొత్తు పెట్టుకున్నప్పటికీ ఆ ఎన్నికల్లో టీడీపీ ఓడిపోయింది. కాంగ్రెస్ గెలిచింది. 1994లో సిపిఐ, సిపిఎంతో పొత్తు పెట్టుకుని గెలిచింది. 2004లో బీజేపీతో పొత్తు పెట్టుకున్నారు కానీ ఓటమిపాలయ్యారు. 2009 నాటికి బీజేపీకి దూరంగా జరిగింది టీడీపీ. వామపక్షాలు, టీఆర్ఎస్‌తో పొత్తు పెట్టుకుంది. అయినా పరాజయం తప్పలేదు. చిరంజీవి స్థాపించిన ప్రజారాజ్యం పార్టీ పోటీ చేయడం కాంగ్రెస్‌కు కలిసి వచ్చి ఆ పార్టీ విజయం సాధించింది. 2014లో రాష్ట్ర విభజన తర్వాత మళ్ళీ బీజేపీతో పొత్తు పెట్టుకుంది టీడీపీ. 45 శాతం ఓట్ షేర్‌తో 102 సీట్లు సాధించి అధికారంలోకి వచ్చింది. 2019 అసెంబ్లీ ఎన్నికల్లో పొత్తు లేకుండా ఒంటరిగా టీడీపీ ఎన్నికల బరిలోకి దిగి ఓటమి పాలైంది. ప్రజారాజ్యం పార్టీ పెట్టినప్పుడు టీడీపీకి బలమైన దెబ్బ తగలగా 2019లో జనసేన పోటీతో టీడీపీ ఓటు బ్యాంకు తగ్గింది. జనసేన ఒక్క సీటుకే పరిమితమైనా, టీడీపీకి కోలుకోలేని దెబ్బ తగిలింది. రాబోయే ఎన్నికల్లో తెలుగుదేశంపార్టీ ఎవరితో పొత్తు పెట్టుకుంటుంది? అసలు పొత్తు ఉంటుందా లేదా అనే అంశంపై ఇంకా స్పష్టత లేదు.

## రాష్ట్ర బీజేపీలో మూడు గ్రూపులు

రాష్ట్ర బీజేపీలో ప్రస్తుతానికి మూడు గ్రూపులున్నాయి. ఒకటి వైసీపీ బీజేపీ, రెండు టీడీపీ బీజేపీ, మూడు అసలు బీజేపీ. ఈ 3 గ్రూపుల్లోని నాయకుల దారులు పరస్పర విరుద్ధాలు. బీజేపీ తరపున కూడా పవనే పొత్తుల ప్రకటన చేసినా ఒక్కరు కూడా ధీటుగా స్పందించలేదు. తమ విధానమేంటో చెప్పలేకపోయారు. మీడియా బలవంతపెడితే జీవీఎల్ నరసింహారావు, సోము వీర్రాజు మొక్కుబడిగా ఈ ప్రతిపాదన అధిష్టానం పరిశీలనలో ఉందని తప్పుకున్నారు. పొత్తులపై పవన్ బహిరంగ ప్రకటన చేసేవరకు కూడా టీడీపీ లాంటి అవినీతి పార్టీతో పొత్తు ప్రశ్నే లేదని కుండబద్దలు కొట్టేవారు బీజేపీ నేతలు. బీజేపీ వైసీపీకి దగ్గరగా ఉందని, ఆ మాట తాము చెప్పడం లేదు, ప్రజలే అనుకుంటున్నారని ఏపీ టీడీపీ అధ్యక్షుడు అచ్చెన్నాయుడు ఇటీవల వ్యాఖ్యానించారు. ఆయన మాటల్లో ఓ అర్థం ఉంది. వైసీపీ దూరమని నిరూపించుకోవాలని బీజేపీకి సవాల్ వేశారు. ఈ బాధ బీజేపీని కూడా పీడిస్తోంది. ఇటీవల బీజేపీ తరపున ఎమ్మెల్సీగా పోటీచేసి ఓడిపోయిన మాధవ్ కూడా ఇలాగే మధనపడ్డారు. కేంద్రం నుంచి వైసీపీ ప్రభుత్వానికి, వైసీపీ నేతలకు వ్యక్తిగతంగా అందుతున్న సాయం బహిరంగమే. రాష్ట్ర బీజేపీ అధ్యక్షుడు సోము వీర్రాజు వైసీపీపై దోమ కూడా వాలనివ్వరు కాబట్టి వైసీపీ, బీజేపీ రెండూ ఒకటేనన్న అభిప్రాయం ప్రజల్లో బలంగా నాటుకుపోయింది. వైసీపీపై ఉన్న వ్యతిరేకత బీజేపీకి అంటుకుంటుంది కాబట్టి బీజేపీతో పొత్తు పెట్టుకోవడం ఎంతవరకు లాభిస్తుందనే అంశంపై టీడీపీ తటపటాయిస్తోంది. రాష్ట్ర ప్రభుత్వం చేస్తున్న అడ్డగోలు అప్పులకు కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం ఎడాపెడా అనుమతులిస్తూనే ఉంది.

## 2019లో జనసేన బలం ఎంతంటే...

గత ఎన్నికల్లో జనసేనకు 5.53 శాతం ఓట్లు వచ్చాయి. రాయలసీమలో వచ్చిన ఓట్లు 2శాతం. కోస్తాలో 7.2శాతం వచ్చాయి. శ్రీకాకుళంలో 2.98 శాతం, విజయనగరంలో 2.48శాతం, ఉమ్మడి విశాఖలో జనసేనకు 8.6 శాతం ఓట్లు వచ్చాయి. కానీ, ఈ జిల్లా నుంచి పవన్ పోటీ చేసి ఓడిపోయారు. తూర్పు గోదావరిలో (ఉమ్మడి జిల్లాలు) జనసేనకు 14.8 శాతం, పశ్చిమ గోదావరి జిల్లాలో 11.7శాతం, కృష్ణాలో 5.3శాతం, గుంటూరులో 5.98శాతం ఓట్లు వచ్చాయి. ఆ 4 జిల్లాల్లో సగటున జనసేన సాధించిన ఓట్లు 9.4శాతం. ప్రకాశంజిల్లాలో 1.42 శాతం, నెల్లూరులో 2.17 శాతం, కడపలో 1.45 శాతం, కర్నూలులో 1.71 శాతం, అనంతపురంలో 2.24 శాతం, చిత్తూరులో 2.86 శాతం ఓట్లు మాత్రమే వచ్చాయి. సగటున 5.53 శాతం ఓట్లు సాధించింది జనసేన. ఇప్పుడు ఏకంగా తమ బలం 25 శాతానికి పెరిగిందని, అంటే 2019 కంటే ఐదు రెట్లు తమ బలం పెరిగిందని పవన్‌కళ్యాణ్ చెప్తున్నారు. పొత్తు భాగస్వామి టీడీపీ నుంచి గౌరవప్రదమైన సీట్లు పొందేందుకు ఈ లెక్కలు చెప్తున్నట్లున్నారు. జనసేన అంతో ఇంతో ఉనికిలో ఉన్న ఉభయగోదావరి, కృష్ణా, గుంటూరు జిల్లాల్లో కూడా జనసేన కంటే టీడీపీ బలంగా ఉంది. అలాంటప్పుడు టీడీపీ తమకు బలమున్న చోట తమకంటే బలహీనంగా ఉన్న జనసేనకి సీట్లు ఇస్తుందా అనేది చూడాలి. పొత్తు భాగస్వామి జనసేనకు సీట్లు కేటాయించేటప్పుడు 2019లో ఆ పార్టీ సాధించిన 5.53 శాతం ఓట్లను పరిగణనలోకి తీసుకుంటుందో లేదా ప్రస్తుతం జనసేనాని చెప్పుకుంటున్న 25 నుంచి 30 శాతం ఓట్లను పరిగణనలోకి తీసుకుంటుందో వేచిచూడాల్సిందే...!

పొత్తులతోనే పొద్దుపొడుస్తుందనే విషయం ఒంటరిపోరాటం చేయలేని భాజపా- తెదేపాలకు తెలిసినా, జనసేనతో ఏ మేరకు అది సాధ్యమన్న అయోమయంలో ఆ రెండు పార్టీలు వున్నట్లు స్పష్టమౌతోంది. జనసేనాని పదేపదే పొత్తుల పాట పాడుతున్నా... ఆ రెండు పార్టీలు మాత్రం మౌనబాట పట్టాయి. మౌనం అర్ధంగీకారమే... కానీ, పూర్తిగా ఆమో దించినట్లు కాదుకదా అన్నది విశ్లేషకుల అభిప్రాయం!..

## కల్యాణ వైభవం...!



నెల్లూరు వాస్తవ్యులు దువ్వూరు వెంకటేష్‌రెడ్డి - పద్మావతిల కుమారుడు **కార్తీక్ శరణ్‌రెడ్డి - ప్రీతిక** (నెల్లూరు వాస్తవ్యులు పసుపులేటి నారాయణ - శారదల కుమార్తెల వివాహం మే 11వ తేదీ నెల్లూరులోని కస్తూరిదేవి గార్డెన్స్‌లో వైభవంగా జరిగింది. నూతన వధూవరులకు 'లాయర్' శుభాశీస్సులు.



నెల్లూరు వాస్తవ్యులు కొండపల్లి వెంకట సురేష్‌బాబు - సునీతల కుమార్తె **సాయి మేఘన - సత్యనారాయణ** (గుడివాడ గోకవరపు వెంకట శివరామకృష్ణ ప్రసాద్ - లక్ష్మీవెంకట నాగరోహిణిల కుమారుడు)ల పరిణయం మే 12వ తేదీ నెల్లూరులోని ఎంసిఎస్ కళ్యాణ మండపంలో ఘనంగా జరిగింది. కొత్త జంటకు 'లాయర్' శుభదీవెనెలు.

35 Years of Academic Excellence.... ESTD : 1988
VISWASAI
Dr.SRK.SCHOOL
(Recognised by the Govt of A.P)
Magunta Layout, MSR Nagar, Nellore - 524 003.
Cont: 0861-2325199, Cell: 9951125173, 8977178176.
www.drsrkschools.com
Play Class to X Class
Why Choose Viswasai Dr. SRK School?
- Comfortable timings (8:40 AM to 4.40 PM).
- Well Experienced Staff.
- Stress free Education.
- Spacious Play ground, Lab, Library, Digi Lab, Computers, Sports, Games, Cultural and Literary Activities.
- Special emphasis on Communication Skills.
- All round development of the child.
Enquire, Visit, Know the facts and Decide
Admissions are opened for 2023 – 24.

# ఉపాధి కూలీలకు కనీస సౌకర్యాలు

**డ్వామా పీడీ వెంకట్రావు**



జాతీయ గ్రామీణ ఉపాధి పథకంలో పనిచేస్తున్న కూలీలు ఈ మండు వేసవిలో ఇబ్బందుల పడకుండా మంచినీటి సదుపాయం, ఓఆర్ఎస్ ప్యాకెట్లు, నీడలో ఉండేందుకు షెల్టర్లు వగైరా సౌకర్యాలు కలుగజేస్తున్నామని, వాటిని కూలీలు ఉపయోగించుకోవాలని డ్వామా పీడీ వెంకట్రావు చెప్పారు. ఈనెల 15న ఆయన సైదాపురం మండలం గిద్దలూరు గ్రామ పంచాయతీ పరిధిలో జరుగుతున్న ఉపాధి పనులను పరిశీలించారు. కూలీలతో మాట్లాడి ప్రభుత్వం వారికి కల్పిస్తున్న సౌకర్యాలను తెలియజేశారు. ఈ కార్యక్రమంలో ఆయన వెంట ఏపిఓ మురళి తదితరులు పాల్గొన్నారు.

## వేదాయపాలెం రైల్వేస్టేషన్‌లో రైల్వే ఎస్ఐ తనిఖీలు



నెల్లూరు వేదాయపాలెం రైల్వేస్టేషన్‌లో రైల్వే ఎస్ఐ హరిచందన ఆధ్వర్యంలో ఇటీవల తనిఖీలు నిర్వహించారు. రైల్వే భద్రత, నేరనియంత్రణలో భాగంగా ఈ తనిఖీలు చేపట్టారు. అనుమానాస్పద వ్యక్తుల వివరాలు సేకరించారు. రాత్రి వేళల్లో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా బందోబస్తు ఏర్పాటు చేశారు. రైల్వేస్టేషన్‌లో భద్రతను కట్టుదిట్టం చేశారు.



## ఉత్తమ సేవలకు సన్మానం

కృష్ణపట్నం పోర్టు పరిధిలో ఆదాని ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఉత్తమ పనితీరుతో రాణిస్తున్న పలువురు సిబ్బందికి ఈనెల 16న సన్మానాలు జరిగాయి. ఆదాని ఫౌండేషన్ దక్షిణ భారత అధికారి అనిల్ బాలకృష్ణన్, కృష్ణపట్నం అధికారి రాజేష్ రంజన్‌లు పాల్గొని ఆ సిబ్బందిని సన్మానించారు. వారి పనితీరును అభినందిస్తూ ప్రశంసాపత్రాలు అందజేశారు. పోర్టు పరిసరాల్లోని ప్రజలను విద్య వైద్యరంగాల్లో ప్రోత్సహించేందుకు తమ ఫౌండేషన్ తరపున అనేక సామాజిక కార్యక్రమాలను నిర్వహిస్తున్నామని వారు ఈ సందర్భంగా చెప్పారు. ఈ కార్యక్రమంలో ఎస్‌పిఓ రమేష్‌బాబు, పిఓలు అనూష, మాతమ్మ తదితరులు పాల్గొన్నారు.

# కమలాన్ని ఖంగుతినిపించిన కన్నడిగులు




మనకు పక్కనే ఉంది. మనకు ఆనుకునే ఉంది. తెలుగువారు దాదాపు 50 నియోజకవర్గాలను ప్రభావితం చేయగల స్థితిలో ఉంది. అదే కర్ణాటక. అక్కడ తిమ్మిని బమ్మిని చేసి, సకల గారడీ విద్యలు ప్రదర్శించి... బీజేపీ రాష్ట్ర పాలనాధికారాన్ని తనదైన "ప్రజాస్వామిక పద్ధతుల్లో" గతంలో చేజిక్కించుకుంది. అయినప్పటికీ, కన్నడ ప్రజలు పెద్దగా ఫీల్ అవ్వలేదు. ముత్యాల ముగ్గు సినిమాలో ముళ్ళపూడి వెంకటరమణ గారు చెప్పినట్టు... సోమరాజు అయితే ఏమిటి, కామరాజు అయితే ఏమిటిలే అనుకున్నారు. కొత్తగా ముఖ్యమంత్రి అవతారం ఎత్తిన యడ్యూరప్ప భూములేవో తినేసి, నాల్రోజుల పాటు జైలుకు వెళ్లినా... కన్నడిగులు పెద్దగా ఫీల్ అవ్వలేదు. అంత పెద్ద లీడర్ అన్న తరువాత.... ఆ మాత్రం అయినా తినకపోతే ఎలా అని సరిపెట్టుకున్నారు.

దీనికితోడు వివిధ కులాల, మత, మఠ గురువులు, ఆర్ఎస్ఎస్ నాయకులు, వారి శిష్య, ప్రశిష్య పరమాణువులు, 20% పైబడి ఉన్న లింగాయత్‌లు, వారి మఠ గురువులు, వీరందరినీ మించి జాతీయాంతర్జాతీయ బహు భావా కోవిదులైన మన ప్రియతమ ప్రధాని నరేంద్రమోడీ హామీలు... హావభావ ప్రదర్శనలతో కూడిన రోడ్‌షోలు మొదలైనవాటి నేపథ్యంలో తమను కర్ణాటక వాసులు మరోసారి భుజాల మీద మోస్తారని బీజేపీయులు ఆశించారు.

ఆ ఆశతోనే, నరేంద్ర మోడీ... ప్రధాని విధులను కూడా పక్కనపెట్టి, కర్ణాటకలో 19 బహిరంగ సభల్లో మాట్లాడారు. బ్రహ్మాండమైన ఆరు రోడ్‌షోల్లో చేతులు ఊపారు.

సరే, ఆవుతో పాటే... దూడ కూడా అన్నట్టుగా, ప్రధానితో పాటే... హోంమంత్రి అమిత్ షా కూడా కర్ణాటకలో నలుమూలలా తిరిగారు. ఆయనా చేతులు ఊపారు. కేంద్ర మంత్రులు, బీజేపీ పాలిత రాష్ట్రాల ముఖ్యమంత్రులైతే సరే సరి. రాష్ట్రం అంతా దున్నేశారు.

అయినా సరే. కర్ణాటక ప్రజలు మోడీ అహంభావాన్ని చావుదెబ్బ తీశారా అన్నట్టుగా ఫలితాలు వెలువడ్డాయి. ఎందుకంటే, కర్ణాటకలో పొరపాటున బీజేపీ గెలిచి ఉంటే... మొత్తం క్రెడిట్ అంతా... 100% మోడీ ఖాతాకు జమ అయిపోయి ఉండేది. గతంలో 'తెచ్చుకున్న' 104 సీట్ల స్కోర్‌ను ఇప్పుడు ఓటర్లు సగానికి కత్తిరించేశారు. మండుటేసవిలో వచ్చిన కర్ణాటక ఎన్నికలలో 'కమలం' కమిలి పోయేలా తీర్పు చెప్పి ఖంగుతినిపించారు కన్నడిగులు.

నేటి కాలపు సగటు మనిషి జీవించడానికి అవసరమైన రోటీ - కపడా - మకాన్ గురించి కాకుండా... త్రేతాయుగం నాటి అంజనేయుడు- రాముడు - హిజాబ్ - ముస్లింల పొట్టగొట్టుడు ఎలా - అంటూ బీజేపీ నేతలు మత విషాన్ని కన్నడిగుల మెదళ్ళలోకి ఎక్కించడానికి విశ్వప్రయత్నాలు చేశారు.

చివరకి, 2014లో "అభివృద్ధి" నినాదంతో అధికారంలోకి వచ్చిన ప్రధాని మోడీ కూడా 'జై భజరంగ భళీ' అంటూ సింధూరాన్ని కర్ణాటకపై చల్లడం కోసం... రంగు రంగు డ్రెస్సులతో... వేసిన డ్రస్సు వేయకుండా... ఆరుసార్లు రోడ్‌షో చేశారు. 19 సభల్లో మాటలు 'ఆడారు'.

బీజేపీ నేతల గారడీ ప్రసంగాలను కర్ణాటక బుద్ధిజీవులు... ఈ చెవితో విని, ఆ చెవితో వదిలేశారు.


బీజేపీని వారు ఇంత దారుణమైన దెబ్బ తీయడానికి కారణం?

కరప్షన్. అవినీతి. లంచగొండి తనం. 30 నుంచి 40 శాతం కమిషన్.

ఏదో చాటుమాటుగా కాదు. మొహం మీద కొట్టినట్టుగా మంత్రులు... ప్రజా ప్రతినిధులు... వారి ప్రతినిధులు, గ్రామస్థాయి వరకు... బొట్లో చెయ్యేసి మరీ వసూలు చేశారంటూ కర్ణాటక సమాజం కోడై కూస్తుంటే.... 'అవినీతికి పాల్పడను... అవినీతికి పాల్పడ నివ్వను' అని ప్రకటించిన మోడీ చెవులకు ఆ ఘోష వినిపించలేదు. పైపెచ్చు, ప్రతిపక్షాలలో ఎవరు దొరుకుతారా అని వెదకడమే ఆయనకు ఫుల్‌టైమ్ జాబ్ అయిపోయిందా అన్నట్టుగా వ్యవహరించారు. దేశంలో ఎక్కడ ఎన్నికలు జరిగినా... ఆయనే స్వయంగా పోటీ చేస్తున్నట్టుగా ఆ ప్రాంతంపై దండయాత్రలు ఆయనకు పరిపాటిగా మారిపోయాయి అని ప్రతిపక్షాలు చేసే విమర్శలను ఆయన పట్టించుకోలేదు. కరప్షన్‌కు తోడు, తెలుగు ప్రజలు కూడా బీజేపీకి గూబ గుయ్ మనిపించారు.

కర్ణాటకతో తెలుగు ప్రజలకు, ఆంధ్రప్రదేశ్‌లోని తెలుగు ప్రజలకు అనాదిగా ఉన్న అవినాభావ సంబంధాలు కూడా ఈ ఎన్నికల్లో బీజేపీని డొక్కలో పొడిచాయి. ఆంధ్రప్రదేశ్‌లో దాని నిర్వాకాన్ని గత నాలుగేళ్లుగా చూస్తున్న వారిలో అధికుల రక్తం సలసల కాగిపోతూ వచ్చింది. సమయం వచ్చినప్పుడు, బీజేపీని ఓడించడానికి ఏమి చేయాలో అది చేశారు.

బీజేపీని 40% కమిషన్ మాత్రమే ఓడించడానికి... కాంగ్రెస్‌వారు పులుకడిగిన ముత్యాలు ఏమీ కాదు. ప్రదేశ్ కాంగ్రెస్ కమిటీ అధ్యక్షుడు కూడా అయిన డీకే శివకుమార్‌పై ఇప్పటికే బోలెడు అవినీతి కేసులు ఉన్నాయ్. వచ్చే కొద్దిరోజుల్లో ఇంకా చాలామంది కాంగ్రెస్ నేతలపై సీబీఐ కేసులు నమోదు అవుతాయి. "మేమే కాదు. కాంగ్రెస్‌వాళ్ళు మాకంటే పెద్ద అవినీతిపరులు" అని కర్ణాటక


వాసులకు బీజేపీ/ మోడీ చెప్పబోతున్నారు. అందుకే, కర్ణాటక డీజీపీగా ఉన్న ప్రవీణ్‌సూద్‌ను సీబీఐ కొత్త బాస్‌గా తీసుకు వస్తున్నారు.

హిమాచల్‌ప్రదేశ్‌కు చెందిన ప్రవీణ్ సూద్ బీజేపీకి అనుకూలంగా పని చేస్తూ కాంగ్రెస్‌వాళ్ళను ఇబ్బంది పెడుతున్నారంటూ డీకే శివకుమార్ పబ్లిక్‌గానే స్టేట్మెంట్‌లు ఇచ్చారు. ఆయనను అరెస్ట్ కూడా చేయాలని అన్నారు. ఆయనే ఇప్పుడు సీబీఐకి కొత్త బాస్. శివకుమార్‌పై పాత సీబీఐ కేసులు ఉన్నాయ్. వాటిని ఇప్పుడు గిల్లితే సరిపోతుంది. ప్రవీణ్‌సూద్‌కి ఆ విషయం ఒకరు చెప్పాల్సిన పనిలేదు కదా! అదీ విషయం.

కానీ, కాంగ్రెస్‌వాళ్ళు ఎప్పుడో 'తింటారు' 'తింటారు' అని.... ఇప్పుడు బోన్స్‌తో సహా నమిలి మింగేస్తున్న వారిని ప్రజలు భరించలేరు కదా! అందుకే బీజేపీని ఇంటికి పంపించేశారు.

అదీ, మోడీకి అత్యంత ముఖ్యమైన లోక్‌సభ ఎన్నికలు కనుచూపు మేరలోకి వచ్చేసిన ఈ సమయంలో కర్ణాటక జనం వ్యక్తం చేసిన ఈ 'అసహనం' బీజేపీకి శరాఘాతం అనడంలో సందేహం లేదు. 'కర్ణాటక వాసులు బుజ్జి నాన్నలు' అని భావించిన బీజేపీకి... దుర్యోధనుడికి ద్రౌపదీదేవి చేతిలో జరిగినంత పరాభవం జరిగింది. దీనిని బీజేపీ మరిచిపోలేదు.

కానీ, నేరుగా అధికారం చేజిక్కించుకోవడంలో విఫలమైన బీజేపీ, ఇప్పుడు ప్లాన్-బీని బయటకు తీస్తుంది అనడంలో సందేహాలు అవసరం లేదు.

ఎందుకంటే, గతంలో కర్ణాటకలోనే అమలు చేసింది. మహారాష్ట్రలో అమలు చేసింది. మధ్యప్రదేశ్‌లో అమలు చేసింది. బీహార్‌లో అమలు చేద్దామనుకుంది గానీ, ఆ ముఖ్యమంత్రి నితీష్‌కుమార్ 'దొరక'లేదు.

కర్ణాటకలో ఇప్పుడు గెలిచిన కాంగ్రెస్‌లో ఉన్న ముఠా తాగాదాలు, కుల పంచాయితీలు, సీఎం పదవి కోసం తెరమీదకు వచ్చిన సిగపట్లు చూస్తుంటే... బీజేపీకి 'మళ్లీ' చేతినిండా పని పడవచ్చు అనిపించక మానదు. కాకపోతే కొంచెం సమయం పట్టవచ్చు.

వారికి ప్రజలు విదిలించిన 65 స్థానాలకు, కుమారస్వామి దుకాణానికి వచ్చిన 19 కలిపితే 84 అవుతాయి. ఇంకో 30 మందిని లాగితే... కాంగ్రెస్ పని అయిపోతుంది. ఇదంతా ఇప్పుడు ఊహా జనితమే.

కానీ, బీజేపీ ట్రాక్ రికార్డు చూసినప్పుడు ఇటువంటి 'ముందస్తు భయాలు' కలగడం సహజం.

కాంగ్రెస్ 'హై కమాండ్' ఎంత బలహీనంగా ఉందో.... కర్ణాటక ఎన్నికల ఫలితాలు చెప్పాయి. 'మొత్తం 135 స్థానాలను నేను గెలిపించుకుని వచ్చాను' అని కర్ణాటక కాంగ్రెస్ అధ్యక్షుడు డీకే శివకుమార్ ప్రకటిస్తే... కాంగ్రెస్ హైకమాండ్ నోరు ఎత్తలేదు. అదే.... గతంలో అయితే సోనియా నాయకత్వం వల్లే మాకు ఇన్ని సీట్లు అని కాంగ్రెస్‌వారు ఇల్లు ఎక్కి మరీ కూసేవారు.

ఈ ఎన్నికల ఫలితాలను పలువురు నేతలు పలు రకాలుగా విశ్లేషిస్తున్నారు.

1. మోడీ అదే పనిగా తిరిగినంత మాత్రాన బీజేపీ గెలుస్తుందనే సూత్రీకరణ మసకబారుతుంది అని బీజేపీ మాజీ ప్రధాన సలహాదారుడు కులకర్ణి విశ్లేషించారు.

2. వచ్చే ఎన్నికల్లో కాంగ్రెస్‌తో కలిసి పనిచేస్తామని బెంగాలమ్మ మమతా బెనర్జీ మొదటిసారిగా ప్రకటించారు.

3. మహారాష్ట్రలోనూ కర్ణాటక ఫార్ములాను అమలు చేస్తామని శరద్ పవార్ ప్రకటించారు.

4. ఈ ఏడాది చివర్లో జరగబోయే రాజస్థాన్, తెలంగాణ, ఛత్తీస్‌ఘడ్, మధ్యప్రదేశ్ ఎన్నికల్లో స్థానిక నాయకులకే ప్రాధాన్యం తప్ప, కేంద్రనాయకులకు కాదు అని బీజేపీ డిసైడ్ అయింది.

5. జాతీయస్థాయిలో 'చింపుతాం.... పొడుస్తాం...' అన్న తెలంగాణ ముఖ్యమంత్రి కేసీఆర్ భారత రాజకీయాలను పక్కనబెట్టి, ముందుగా తెలంగాణపై దృష్టిపెట్టారని వార్తలు.

6. ఆంధ్రలో బీజేపీ హతాశురాలు అయినట్టు వినికిడి. మేకపోతు గాంభీర్య ప్రదర్శనకు కూడా అవకాశం లేకుండా పోయిందనే విశ్లేషణలు. పూర్తిగా ఇర్రెలెవంట్ అయిపోయిన పరిస్థితి.

మొత్తంమీద కర్ణాటక ఎన్నికల ఫలితాలు చాలామంది నేతల కళ్ళు తెరిపించాయనే చెప్పాలి.

"ఆ ఫలితాలతో మాకు సంబంధం లేదు. మా పద్ధతులు మావే..." అనేవారితో పేచీ ఏముంటుంది?

శుభం భూయాత్...!

**- భోగాది వేంకట రాయుడు**
bhogadirayudu2152@gmail.com




Edited, Published, Printed & Owned by **THUNGA SIVAPRABHATH REDDY**, Plot no:1&2, Main Road, Magunta Layout, NELLORE-524003. Printed & Published at **Roopa Graphics**, Magunta Layout, NELLORE-3. Cell: 9866314741. Editor-**THUNGA SIVAPRABHATH REDDY,** Managing Editor : **T.BHARATHI REDDY,** Sub-Editor : **MADDURU SRINIVASULU.** e-mail: lawyerpatrika@gmail.com